


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 | సంచిక : 246 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 12 మే 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

# తెలంగాణ ఎప్ సెట్ రిజల్ట్స్ రిలీజ్

## ఇంజినీరింగ్ టాపర్ ఏపీ స్టూడెంట్

- టీజీ ఎప్‌సెట్ ఫలితాలను విడుదల చేసిన సీఎం రేవంత్
- ఇంజినీరింగ్‌లో అబ్బాయిలదే హవా
- ఇంజినీరింగ్‌లో పల్లా భరత్‌చంద్రకు, అగ్రికల్చర్-ఫార్మాలో సాకేత్‌రెడ్డికి ప్రథమ ర్యాంకు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఎప్‌సెట్) 2025 ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి అధికారులు ఫలితాల వివరాలను వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఈ ఏడాది బాలురు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. మొదటి పది ర్యాంకులనూ వారే కైవసం చేసుకోవడం విశేషం. అంతేకాకుండా, ఇంజినీరింగ్‌లో తొలి మూడు అత్యున్నత స్థానాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర ప్రథమ ర్యాంకు సాధించగా, నంద్యాల జిల్లా కోనాపురం నివాసి ఉడగండ్ల రామ్‌చరణ్‌రెడ్డి ద్వితీయ ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్ తృతీయ ర్యాంకును కైవసం చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఇక తెలంగాణ విద్యార్థుల్లో, హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్ నాలుగో ర్యాంకు సాధించారు. మాదాపూర్‌కు చెందిన మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్‌రెడ్డి ఆరో ర్యాంకు, రష్మిత్ బండారి ఏడో ర్యాంకు పొందారు. బడంగ్‌పేట్‌కు చెందిన బనిబ్రత మాజీ ఎనిమిదో ర్యాంకు, హైదరాబాద్ వాసి కొత్త ధనుష్‌రెడ్డి తొమ్మిదో ర్యాంకు, మేడ్చల్‌కు చెందిన కొమ్మ కార్తీక్ పదో ర్యాంకు సాధించినట్లు అధికారులు వివరించారు.

అగ్రికల్చర్ మరియు ఫార్మా విభాగంలోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ విభాగంలో మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డి మొదటి ర్యాంకును సొంతం చేసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య రెండో ర్యాంకు సాధించగా, వరంగల్‌కు చెందిన అక్షిత్ మూడో ర్యాంకు పొందారు. కొత్తకోట (వనపర్తి) వాసి సాయినాథ్ నాలుగో ర్యాంకు, మాదాపూర్‌కు చెందిన బ్రాహ్మణి ఐదో ర్యాంకు, కూకట్‌పల్లికి చెందిన గుమ్మడిదల తేజస్ ఆరో ర్యాంకు, నిజాంపేటకు చెందిన అఖిరానందన్‌రెడ్డి ఏడో ర్యాంకు, సరూర్‌నగర్ వాసి భానుప్రకాశ్‌రెడ్డి ఎనిమిదో ర్యాంకు, హైదర్‌గూడకు చెందిన శామ్యూల్ సాత్విక్ తొమ్మిదో ర్యాంకు, బాలాపూర్‌కు చెందిన అద్దుల శశికరణ్‌రెడ్డి పదో ర్యాంకు సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

### రేవంత్ రెడ్డి ఒక సైకో, శాడిస్ట్ అంటూ ఈటల ఫైర్...

# ఘాటుగా కౌంటర్ ఇచ్చిన జగ్గారెడ్డి

- ఈటలపై జగ్గారెడ్డి ఫైర్: బట్టలిప్పి గుంజీలు తీయిస్తా అంటూ వార్నింగ్
- రేవంత్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- ఈటలవి నల్లికుట్ల రాజకీయాలు అంటూ విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని పూజిత అపార్ట్‌మెంట్‌కు హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేత నోటీసులు జారీ చేసిన ఘటన తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నిన్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పెద్ద శాడిస్ట్, సైకో. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంలోనే ఆయన ఆనందం పొందుతున్నారు. రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం నడుస్తోంది. ప్రజల జోలికి వస్తే ఖబడ్దార్," అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలను సీఎం గమనించడం లేదని, తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా ఆయనకు తెలియడం లేదని దుయ్యబట్టారు. "ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని వ్యవస్థను సరిదిద్దుకోవాలి. ప్రజల జీవితాలతో చెలగాటమాడేవారు ఎవరూ బాగుపడరు" అని హితవు పలికారు.

**ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు: జగ్గారెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరోసారి ఇటువంటి 'లూజ్ కామెంట్స్' చేస్తే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు... అన్నీ బేవకూఫ్ చేష్టలు చేస్తున్నాడు అంటూ మండిపడ్డారు. ఆదివారం నాడు గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన నల్లికుట్ల రాజకీయాలు మానుకోవాలి. హద్దులు మీరి నువ్వు మాట్లాడావు, అందుకే నేను కూడా

వివరాలు 2లో..

# ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం... కానీ మతి తప్పినట్టుంది

- సీఎం రేవంత్‌పై ఈటల వ్యాఖ్యల పట్ల ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం
- ఈటల మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శ
- బీజేపీ అధ్యక్ష పదవి కోసం సీఎంను దూషిస్తున్నారని ఆరోపణ
- అనుచిత భాష వాడితే సహించేది లేదని హెచ్చరిక



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈటలను తాను ఒక మర్యాదస్తుడిగా భావించేవాడినని, కానీ ఆయన ఇటీవలి మాటలు చూస్తుంటే, మతి తప్పినట్లుగా ఉందని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలనుకుంటే మీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవాలి తప్ప,

వివరాలు 2లో..

# అటు నుంచి తూటా వస్తే, ఇటు నుంచి బాంబు వెళ్లాలి!

## ఆర్మీకి స్పష్టం చేసిన మోదీ!

- రక్షణ శాఖ అధికారులతో ప్రధాని మోదీ సమావేశం
- తూటాకు తూటానే సమాధానం ఇవ్వాలంటూ ప్రధాని మోదీ ఆదేశాలు!
- పాక్ దాడి చేస్తే మన ప్రతిదాడి శక్తిమంతంగా ఉండాలని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించేది లేదని, వారి కాల్పులకు దీటైన జవాబు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సాయుధ బలగాలకు కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. 'తూటాకు తూటానే సమాధానం' అనే రీతిలో ప్రతిస్పందన ఉండాలని స్పష్టం చేసినట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది.

ఏఎన్ఐ కథనం ప్రకారం... "అక్కడి నుంచి ఒక తూటా పేలితే, ఇక్కడి నుంచి బాంబు వెళ్లాలి. సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి పాకిస్థాన్ సైన్యం కాల్పులకు తెగబడితే, భారత బలగాలు

వివరాలు 2లో..

### ప్రధాని మోదీ నివాసంలో

# హై లెవల్ మీటింగ్

- కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన పాక్
- సమీక్ష చేపట్టిన ప్రధాని మోదీ
- మోదీ నివాసంలో సమావేశానికి రాజ్ నాథ్, జై శంకర్, దోవల్ హాజరు
- హాజరైన సీడీఎస్, త్రివిధ దళాల అధిపతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొద్ది గంటల్లోనే పాకిస్థాన్ దానిని ఉల్లంఘించిన నేపథ్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు హై లెవల్ మీటింగ్ నిర్వహించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసం 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు

వివరాలు 2లో..

### కాల్పుల విరమణను మొదట ట్రంప్ ప్రకటించారు...

# దీనిపై చర్చించాలి

## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ



- భారత్-పాక్ కాల్పుల విరమణ
- పార్లమెంటు సమావేశానికి రాహుల్ గాంధీ, ఖర్గే డిమాండ్
- ప్రధాని మోదీకి వేర్వేరుగా లేఖలు రాసిన రాహుల్, ఖర్గే

వివరాలు 2లో..

# మన పోరాటాలు భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయి

**హైదరాబాద్ పెన్ పవర్:** రేపటి తరాల భవిష్యత్తు మన పోరాటాలపైనే ఆధారపడి ఉందని అన్నారు వివేక్. ఎంతో కులవివక్ష ఉన్నప్పటికీ డా.అంబేద్కర్ 23 డిగ్రీలు సాధించారని చెప్పారు. అంబేద్కర్ పోరాటాల ఫలితంగానే మనం ఇప్పుడు ఇలా ఉన్నామని.. మన పోరాటాలు మన భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయని చెప్పారు ఎమ్మెల్యే వివేక్. 'తిరుపతి మాలల ఆత్మీయ సభ'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న

వివరాలు 2లో..



### పుల్వామా దాడిలో మా పాత్ర ఉంది..

# పాకిస్థాన్ సైన్యం సంచలన ప్రకటన

- 2019 భారత పారా మిలటరీ సిబ్బందిపై ఉగ్రదాడి
- 40 మంది భారత సైనికుల మృతి
- దాడిలో తమ హస్తం లేదని ఇప్పటి వరకు పాక్ బుకాయింపు
- ఇప్పుడు బహిరంగంగా అంగీకరించిన పీఏఎఫ్ ఎయిర్ వైస్ మార్షల్
- పాక్ ద్వంద్వ వైఖరి మరోమారు బట్టబయలు

వివరాలు 2లో..



# రావల్పిండిలోనూ మన సైన్యం కదం తొక్కింది



- పాక్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా దాడులు
- పౌరులకు హాని కలిగించలేదన్న రాజ్ నాథ్
- ఉగ్రవాదంపై భారత దృఢ వైఖరికి నిదర్శనమన్న రాజ్‌నాథ్
- లక్నోలో బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కేంద్రం ప్రారంభం

వివరాలు 2లో..

# బ్రహ్మోస్ సత్తా ఏంటో పాకిస్థాన్‌ను అడగండి

## యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు



- బ్రహ్మోస్ క్షిపణి శక్తి ఏంటో పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోమన్న యూపీ సీఎం యోగి
- 'ఆపరేషన్ సిందూర్' విజయం బ్రహ్మోస్ సత్తాను ప్రపంచానికి చూపిందని ప్రశంస
- లక్నోలో రూ.300 కోట్లతో నిర్మించిన బ్రహ్మోస్ క్షిపణి ఉత్పత్తి యూనిట్ ప్రారంభం
- ఉగ్రవాదానికి దాని భాషలోనే సమాధానం చెప్పాలని వ్యాఖ్య
- ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై పోరాటానికి ఏకతాటిపై నిలవాలని పిలుపు

వివరాలు 2లో..

# కశ్మీర్ వివాద పరిష్కారానికి భారత్, పాక్‌లతో కలిసి పనిచేస్తా

- భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- కశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలతో కలిసి పనిచేస్తానని ప్రకటన
- భారత్, పాక్ నాయకత్వాన్ని ప్రశంసించిన అమెరికా అధ్యక్షుడు
- ట్రంప్ ప్రతిపాదనపై ఇంకా స్పందించని భారత్
- కశ్మీర్ అంతర్గత వ్యవహారమని భారత్ వాదన



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మళ్లీ అధికారం కావాలంటే.. కాళ్లు కదపాల్సిందేనా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మళ్లీ పాదయాత్రతో జనంలోకి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాల పర్యటనల కంటే పాదయాత్రతోనే మరోసారి అధికారంలోకి రావచ్చని జగన్ గట్టిగా విశ్వసిస్తున్నట్లుంది. 2027లో జగన్ పాదయాత్ర ఆంధ్రప్రదేశ్ లో ప్రారంభం అవుతుందని కొన్ని మీడియాల్లో ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. అయితే జగన్ పాదయాత్రపై మాత్రం అధికారిక ప్రకటన వైసీపీ నుంచి రాలేదు. జగన్ కూడా ఎక్కడా పాదయాత్ర విషయాన్ని ప్రస్తావించలేదు. మరోసారి పాదయాత్ర చేస్తే పార్టీని బలోపేతం చేయడంతో పాటు విజయాన్ని కూడా అందుకోవచ్చని జగన్ గట్టిగా భావిస్తున్నారు. కానీ రెండోసారి పాదయాత్ర ఏ మేరకు వర్క్ అవుట్ అవుతుందన్న దానిపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**గత ఎన్నికల్లోనూ...**

2019 ఎన్నికలకు ముందు జరిపిన పాదయాత్ర వల్లనే తాను అధికారంలోకి వచ్చానని జగన్ భావిస్తున్నారు. అందులో నిజం కూడా లేకపోలేదు. మండుటెండలోనూ, వర్షాలలోనూ యాత్రను ఆపకుండా చేయడంతోనే ప్రజలు పార్టీకి కనెక్ట్ అయ్యారు. అందుకే 151 స్థానాలు వచ్చాయని వైసీపీ నేతలు కూడా పలు సందర్భాల్లో అభిప్రాయం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికలకు ముందు కూడా నారా లోకేశ్ జరిపిన యువగళం పాదయాత్రతోనూ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయన్న వాదన కూడా ఉంది. అంతకు ముందు 2014 ఎన్నికల్లో చంద్రబాబు విజయం సాధించడానికి మీకోసం పాదయాత్ర అనేది కూడా అంతే నిజం. ఇలా పాదయాత్రలు విజయానికి దగ్గరగా బాటలు వేస్తుండటంతో దానిపైనే జగన్ దృష్టిపెట్టినట్లు అంటున్నారు.

**కనెక్ట్ అవుతారని...**

పాదయాత్ర ద్వారా అయితేనే తాను ప్రజల్లోకి సులువుగా వెళ్లగలనని, వారిని కలుసుకోవడంతో పాటు నేరుగా కనెక్ట్ అయి వారితో ఇంటరాక్ట్ అయితే వచ్చే ఫలితం వేరే లేవెల్ గా ఉంటుందని జగన్ భావిస్తున్నారు. కొత్త నాయకత్వాన్ని కూడా ఎంపిక చేసుకోవడానికి పాదయాత్ర ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలులో జాప్యంతో పాటు కొన్నింటిని అమలు చేయకపోవడం, ఇచ్చిన మాట తప్పిందని గ్రామస్థాయిలో తీసుకెళ్లడానికి పాదయాత్ర ఒక్కటే మార్గమని జగన్ నిర్ణయించుకున్నారని, దీనివల్ల తాను కోల్పోయిన ఇమేజ్ ను మరింత పెరిగే అవకాశముందని కూడా అంచనా వేస్తున్నారు.

**జమిలి ఎన్నికల నేపథ్యంలో...**

ప్రస్తుతం దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తే జమిలి ఎన్నికలు రావడం ఖాయంగా కనిపిస్తుంది. అందుకే 2027లో పాదయాత్ర మొదలు పెట్టి పది నెలల్లో ముగించేలా ప్లాన్ చేయాలని యోచిస్తున్నారు. 2028లో ఎన్నికలు జరిగే అవకాశముందని అంచనా వేసుకుని ఆ విధంగా ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. ఈసారి ఇచ్ఛాపురం నుంచి కడప వరకూ పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. మరో ఏడాదికి ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతుందని అప్పుడు పాదయాత్ర చేస్తే ఫలితం ఉంటుందని జగన్ తన ముఖ్య సన్నిహితుల వద్ద అన్నట్లు చెబుతున్నారు అందుకే జిల్లాల పర్యటన వాయిదావేస్తూ వస్తున్నారన్న వాదన కూడా ఉంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరి ఇందులో నిజానిజాలు తెలియాలంటే జగన్ అధికారికంగా ప్రకటించాల్సిందే.

## ప్రధాని మోదీ నివాసంలో హై లెవల్ మీటింగ్

- మొదటి పేజీ తరువాయి

అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు పాల్గొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం శనివారం ప్రకటించగా, అదే రోజు రాత్రి పాకిస్థాన్ ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది. ఈ ఉల్లంఘనలను పరిష్కరించడానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, పరిస్థితిని తీవ్రంగా, బాధ్యతాయుతంగా ఎదుర్కోవాలని పాకిస్థాన్‌ను భారత్ కోరినట్లు సమాచారం. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్.. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలపై డ్రోన్ దాడులకు పాల్పడింది. భారత రక్షణ వ్యవస్థలు ఈ డ్రోన్లను సమర్థవంతంగా అడ్డుకున్నప్పటికీ, అణ్వస్త్ర దేశాలైన ఇరు దేశాల మధ్య ఘర్షణలు మరింత తీవ్రమవుతాయేమోనన్న భయాలు వ్యక్తమయ్యాయి. అయితే, కొద్ది గంటల తర్వాత పరిస్థితి కొంత చల్లబడినప్పటికీ, సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు మాత్రం ఇంకా భయాందోళనలతోనే గడుపుతున్నారు. మోదీ నివాసంలో జరుగుతున్న తాజా సమావేశంలో సరిహద్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

## కశ్మీర్ వివాద పరిష్కారానికి భారత్, పాక్‌లతో కలిసి పనిచేస్తా

**పెన్ పవర్ డెస్క్:** భారత్, పాకిస్థాన్ మధ్య సంచలన రీతిలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని ప్రకటించిన 16 గంటల అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు కశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలతో కలిసి పనిచేస్తానని ముందుకొచ్చారు. 'సమస్యాత్మకమైన' కశ్మీర్ వివాదానికి పరిష్కారం కనుగొనేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అయితే, కశ్మీర్ తమ అంతర్భాగమని, ఈ విషయంలో మూడో పక్షం మధ్యవర్తిత్వాన్ని తాము అంగీకరించబోమని న్యూఢిల్లీ మొదటి నుంచి స్పష్టం చేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ట్రంప్ తాజా ప్రతిపాదనపై భారత ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది."భారత్, పాకిస్థాన్ బలమైన, అచంచలమైన నాయకత్వ పటిమకు నేను గర్విస్తున్నాను. ఎంతో మంది మరణానికి, విధ్వంసానికి దారితీసే ప్రస్తుత దూకుడును ఆపాల్సిన సమయం ఆసన్నమైందని వారు గ్రహించినందుకు వారి బలం, వివేకం, దృఢత్వానికి నా అభినందనలు. లక్షలాది మంది అమాయక ప్రజలు చనిపోయి ఉండేవారు! మీ ధైర్యమైన చర్యలతో మీ వారసత్వం ఎంతగానో పెరిగింది" అని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. "ఈ చారిత్రక, వీరోచిత నిర్ణయానికి అమెరికా సహాయపడటం గర్వకారణం. చర్చల్లో లేనప్పటికీ, ఈ రెండు గొప్ప దేశాలతో వాణిజ్యాన్ని గణనీయంగా పెంచుతాను. అదనంగా, 'వేయి సంవత్సరాల' తర్వాత కశ్మీర్‌కు సంబంధించి ఒక పరిష్కారం లభిస్తుందేమో చూడటానికి మీ ఇద్దరితో కలిసి పనిచేస్తాను" అని పేర్కొన్నారు. నిన్న మధ్యాహ్నం భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య కొన్ని గంటల క్రితమే తీవ్రస్థాయిలో కాల్పులు జరిగిన నేపథ్యంలో ఈ ప్రకటన ఆశ్చర్యం కలిగించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో సుదీర్ఘ చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇరు దేశాలు ఇంగితజ్ఞానం, గొప్ప తెలివితేటలు ప్రదర్శించాయని ట్రంప్ అభినందించారు. కాగా, ఈ పరిణామాలపై ఒక ప్రముఖ అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకుడు మైఖేల్ కుగెల్‌మన్ చేసిన ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. "ట్రంప్ భారత్, పాకిస్థాన్‌ల గురించి మళ్లీ పోస్ట్ చేశారు. ఈసారి కశ్మీర్‌పై 'పరిష్కారం' కోసం వారితో కలిసి పనిచేస్తానని ఆయన అంటున్నారు. వావ్. ఇది ఆయన మొదటి టర్మ్‌లో ఇరుపక్షాలూ కోరుకుంటే కశ్మీర్‌పై మధ్యవర్తిత్వం చేస్తానన్న ఆయన మునుపటి ఆఫర్ల కంటే మరింత ముందుకు వెళుతుంది" అని కుగెల్‌మన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి ఒక సైకో, శాడిస్ట్ అంటూ ఈటల ఫైర్...
# ఘాటుగా కౌంటర్ ఇచ్చిన జగ్గారెడ్డి

- మొదటి పేజీ తరువాయి

హద్దులు దాటి సమాధానం చెప్పాల్సి వస్తోంది. అసలు, ఈటలను తిట్టడానికే ఈ ప్రెస్ మీట్ పెట్టాను" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి ఈటల ఏనాడూ మాట్లాడలేదని, కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆయన ఆరోపించారు. బీజేపీలో ఆశించిన పదవులు దక్కకపోవడంతో ఈటల రాజేందర్ తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. "గంజాయి తాగిన వ్యక్తిలా, ఒక సైకోలా ఈటల ప్రవర్తిస్తున్నాడు. పదవి రాలేదన్న ఫ్రస్టేషన్‌లోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. బూతులు మాట్లాడే వారికి బూతులతోనే సమాధానం చెప్పాల్సి వస్తుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దయతలచి ఈటల వ్యాఖ్యలను పట్టించుకోకుండా వదిలేస్తున్నారేమో కానీ, తాము మాత్రం అలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదని జగ్గారెడ్డి హెచ్చరించారు. "మళ్ళీ ఇంకోసారి ముఖ్యమంత్రి గురించి గానీ, కాంగ్రెస్ పార్టీ గురించి గానీ తగని రీతిలో మాట్లాడితే నడిరోడ్డు మీద బట్టలు విప్పి గుంజీలు తీయిస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో జగ్గారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఈటల తన పరిమితుల్లో ఉండి మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు.

# మన పోరాటాలు భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయి

- మొదటి పేజీ తరువాయి

ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు.

మాల జాతి తక్కువగా ఉంది.. ఏం చేసినా కొట్లాడరనే భావన ప్రభుత్వాలలో ఉందని, అందుకే మాలల విషయంలో ప్రభుత్వాలు, నాయకులు అన్యాయం చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. 'తిరుపతి మాలల ఆత్మీయ సభ'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఏం చేసినా మాలలు పట్టించుకోరు అనే భావన ప్రభుత్వాలలో ఉందని.. మనం కొట్లాడినప్పుడే అది పోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఈ ఆలోచన మాలల్లో రాకుంటే రాబోయే కాలంలో మాలలను అణచి వేస్తారని హెచ్చరించారు.

కొట్లాడకుంటే పని జరగదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైతే డిస్క్రిమినేషన్ ఉందో అక్కడ అఫమేషన్ పాలసీ ఉందని.. ఎవరైతే అణచివేయబడతారో.. వారిని అన్ని విధాల పైకి తీసుకొచ్చి.. అందరికీ సమాన స్థాయిలో తీసుకురావాలనే పాలసీలు అమలు చేస్తున్నారని అన్నారు. కానీ ఇండియాలోనే అలాంటి పాలసీ లేదని అన్నారు. మాలలు కలిసికట్టుగా పోరాడినప్పుడే భవిష్యత్తు.. రాబోయే తరాల పిల్లల భవిష్యత్తు బాగుంటుందని గుర్తు చేశారు.

# ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం... కానీ మతి తప్పినట్టుంది

- మొదటి పేజీ తరువాయి

మా ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తే పదవి వస్తుందనుకోవడం మీ అవివేకానికి నిదర్శనం. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో మీరు ఈ స్థాయికి దిగజారతారని మేము ఊహించలేదు. దయచేసి మీ పిచ్చి వాగుడు, ప్రేలాపనలు ఆపండి" అని హితవు పలికారు. ముఖ్యమంత్రిని 'శాడిస్ట్, సైకో' వంటి పదాలతో దూషించడంపై స్పందిస్తూ, "మాకు కూడా అంతకుమించిన భాషలో సమాధానం చెప్పడం వచ్చు, అది గుర్తుంచుకోండి. ముప్పై ఏళ్ల రాజకీయ అనుభవం ఉండి 'నా కొడకా' వంటి పదాలు వాడుతున్నారంటే మీ మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. మీ నీచ రాజకీయ ప్రయోజనాల కోసం మా ముఖ్యమంత్రిపై దిగజారుడు భాష ఉపయోగిస్తే సహించే ప్రసక్తే లేదు" అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

ఈటల రాజేందర్ తన అనుచిత పదజాలాన్ని మానుకోకపోతే, తాము కూడా అంతకంటే తీవ్రమైన భాషను ఉపయోగించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# మరి ఇప్పుడు ప్రధాని మోదీని పాకిస్థాన్ పంపాలా?

**పెన్ పవర్ డెస్క్:** సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ బీజేపీ నాయకులపై, ప్రధాని నరేంద్ర మోదీ వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో తాను యుద్ధం వద్దని, శాంతియుత పరిష్కారం కావాలని అన్నందుకు తనను పాకిస్థాన్ పంపాలంటూ బీజేపీ నేతలు వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)ను స్వాధీనం చేసుకోకుండానే పాకిస్థాన్‌తో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, "గతంలో నేను యుద్ధం విరమించాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచిస్తే, బీజేపీ నాయకులు నన్ను పాకిస్థాన్ పంపాలని అన్నారు. మరి ఇప్పుడు వారే పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)ను పూర్తిగా మన నియంత్రణలోకి తేకుండానే పాకిస్థాన్‌తో శాంతి చర్చలకు ఎందుకు వెళ్లారు? ఆనాటి వారి లాజిక్ ప్రకారం.. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీని పాకిస్థాన్ పంపాలా?" అని ఘాటుగా ప్రశ్నించారు. ఇటువంటి ద్వంద్వ వైఖరిని ఆయన తప్పుబట్టారు. ఉగ్రవాదం ఎప్పటికీ ప్రమాదకరమైనదేనని నారాయణ స్పష్టం చేశారు. "ఉగ్రవాదులు మానవాళికి పెను ముప్పు. ఉగ్రవాదాన్ని సమూలంగా అంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, చర్యలు చేపట్టాల్సిందే. ఇందులో ఎలాంటి ఉపేక్షకు తావులేదు" అని ఆయన అన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము చెప్పిన విషయాన్ని కొందరు అపార్థం చేసుకుంటున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

అయితే, భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ విరమణ ఒప్పందాలు, శాంతి చర్చల పురోగతిని తాము స్వాగతిస్తున్నామని నారాయణ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనడం మంచి పరిణామమేనని ఆయన అభిప్రాయపడ్డారు. "ఉగ్రవాదులపై దాడి చేయాలని మేం స్పష్టంగా చెప్పినప్పటికీ, మా మాటలను వక్రీకరించి, మమ్మల్ని అపార్థం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం" అని నారాయణ తన ఆవేదనను వ్యక్తం చేశారు

# పుల్వామా దాడిలో మా పాత్ర ఉంది.. పాకిస్థాన్ సైన్యం సంచలన ప్రకటన

**పెన్ పవర్ డెస్క్:** 2019లో జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది భారత పారామిలటరీ సిబ్బంది మృతికి కారణమైన భీకర ఉగ్రదాడి వెనుక తమ సైన్యం హస్తం ఉందని పాకిస్థాన్ సైనిక ఉన్నతాధికారి ఒకరు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏళ్ల తరబడి బుకాయిస్తూ వచ్చిన పాకిస్థాన్ ఎట్టకేలకు అంతర్జాతీయ మీడియా సమక్షంలో ఈ నిజాన్ని అంగీకరించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. విలేకరుల సమావేశంలో పాకిస్థాన్ వైమానిక దళానికి (పీఏఎఫ్) చెందిన పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్, ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ మాట్లాడుతూ.. పుల్వామాలో తమ వ్యూహాత్మక చాకచక్యాన్ని వారికి (భారత్ కు) చాటి చెప్పడానికి ప్రయత్నించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి, నౌకాదళ ప్రతినిధి కూడా పాల్గొన్నారు.

ఔరంగజేబ్ అహ్మద్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ గగనతలం, భూభాగం, జలాలు లేదా ప్రజలకు ముప్పు వాటిల్లితే రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దేశానికి తాము రుణపడి ఉన్నామని చెప్పారు. పాకిస్థానీ ప్రజలు తమ సాయుధ బలగాలపై ఉంచిన నమ్మకాన్ని తాము ఎల్లప్పుడూ, అన్ని పరిస్థితుల్లోనూ కాపాడతామని స్పష్టం చేశారు. పుల్వామాలో మా వ్యూహాత్మక చాకచక్యంతో దాన్ని తెలియజేయడానికి ప్రయత్నించామని, ఇప్పుడు, తమ కార్యాచరణ పురోగతిని, వ్యూహాత్మక చతురతను ప్రదర్శించామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు పుల్వామా దాడిలో పాక్ ప్రమేయాన్ని అంగీకరించడమే కాకుండా, ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ దాడి విషయంలో కూడా పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరిని చెప్పకనే చెబుతున్నాయి.

**గతంలో పాక్ బుకాయింపులు**

పుల్వామా దాడి జరిగిన నాటి నుంచి పాకిస్థాన్ తమ ప్రమేయం లేదని వాదిస్తూ వచ్చింది.

జైషే మహ్మద్ (జేఈఎం) ఉగ్రవాద సంస్థ ఈ దాడికి బాధ్యత వహించినప్పటికీ, నాటి పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. కానీ, తమ సైనిక ప్రమేయాన్ని తిరస్కరించారు. భారత్ అనేక ఆధారాలు సమర్పించినప్పటికీ పాకిస్థాన్ వాటిని తోసిపుచ్చుతూ వచ్చింది. దాడి చేసిన ఆత్మాహుతి దళ సభ్యుడు ఆదిల్ అహ్మద్ దార్‌ను జైషే మహ్మద్‌తో ముడిపెడుతూ భారత్ ఇచ్చిన నివేదికను కూడా పాక్ పట్టించుకోలేదు.

ఎన్నో సంవత్సరాలుగా దాచిపెడుతూ వచ్చిన నిజాన్ని పాకిస్థాన్ సైనిక అధికారి స్వయంగా, బహిరంగంగా కెమెరాల ముందు అంగీకరించడం ద్వారా పుల్వామా దాడి విషయంలో పాకిస్థాన్ ద్వంద్వ వైఖరి మరోసారి బట్టబయలైంది. ఈ తాజా అంగీకారం ఇరు దేశాల మధ్య సంబంధాలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# అటు నుంచి తూటా వస్తే, ఇటు నుంచి బాంబు వెళ్లాలి!

- మొదటి పేజీ తరువాయి

మిస్సైళ్లతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలి. వారు కాల్పులు ప్రారంభిస్తే, మనం రెట్టింపు స్థాయిలో కాల్పులు జరపాలి. వారు దాడి చేస్తే, మనం మరింత శక్తివంతంగా ప్రతిదాడి చేయాలి" అని ప్రధాని స్పష్టం చేశారు.

ప్రధాని మోదీ ఆదేశాలతో భారత సాయుధ బలగాలు సరిహద్దుల్లో ఎలాంటి దుస్సాహసానికైనా దీటుగా బదులిచ్చేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాయి. పీఓకేపై భారత్ వైఖరి, ఆపరేషన్ సింధూర్ కొనసాగింపు వంటి పరిణామాలు పాకిస్థాన్‌కు స్పష్టమైన సందేశాన్ని పంపుతున్నాయి.

# బ్రహ్మోస్ సత్తా ఏంటో పాకిస్థాన్‌ను అడగండి

**పెన్ పవర్ డెస్క్:పెన్ పవర్ డెస్క్:** భారతదేశపు అమ్ములపొదిలోని బ్రహ్మోస్ క్షిపణి శక్తి సామర్థ్యాలు ఎలాంటివో పాకిస్థాన్‌ను అడిగితే తెలుస్తుందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా బ్రహ్మోస్ క్షిపణి తన ప్రతాపాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన కొనియాడారు. లక్నోలోని ఉత్తర ప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఉత్పత్తి కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, 'ఆపరేషన్ సిందూర్' విజయం సాధించినందుకు భారత సాయుధ దళాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఉత్తర ప్రదేశ్ ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మీరు బ్రహ్మోస్ క్షిపణి యొక్క ఒక గ్లింప్స్ చూసి ఉండవచ్చు. ఒకవేళ చూడకపోతే, బ్రహ్మోస్ క్షిపణి శక్తి గురించి పాకిస్థాన్ వాళ్లను అడగండి. ఇకపై ఎలాంటి ఉగ్రవాద చర్య జరిగినా దాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు" అంటూ యోగి గట్టిగా హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌ను రక్షణ ఉత్పత్తుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన కేంద్రంలో ఏటా 80 నుంచి 100 బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేయనున్నారు. ఇది దేశీయ రక్షణ మౌలిక సదుపాయాలకు కీలక చేర్పు అని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, "ఉగ్రవాద సమస్యను పూర్తిగా అణిచివేసే వరకు దానికి పరిష్కారం లభించదు. ఇందుకోసం ప్రధాని మోదీ నాయకత్వంలో మనమందరం ఏకతాటిపై నిలబడి పోరాడాలి. ఉగ్రవాదం ప్రేమ భాషను ఎప్పటికీ అర్థం చేసుకోలేదు. దానికి దాని భాషలోనే సమాధానం చెప్పాలి. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ యావత్ ప్రపంచానికి ఒక సందేశాన్ని ఇచ్చింది" అని యోగి స్పష్టం చేశారు. భారత డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్త్రోయేనియా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ క్షిపణి 290 నుంచి 400 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండి, మాక్ 2.8 వేగాన్ని అందుకోగలదు. దీన్ని భూమి, సముద్రం, గగనతలం నుంచి ప్రయోగించవచ్చు.

కాగా, లక్నో యూనిట్‌లో ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ సెంటర్ కూడా ఉంది. ఇక్కడ ఏటా 100 నుంచి 150 నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్ క్షిపణులు తయారు కానున్నాయి. ఇవి ప్రస్తుత క్షిపణుల కంటే తేలికగా ఉండి, మరింత ఎక్కువ దూరం లక్ష్యాలను ఛేదించగలవు.

# రావల్పిండిలోనూ మన సైన్యం కదం తొక్కింది

**పెన్ పవర్ డెస్క్:** భారత సాయుధ బలగాలు కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్ర స్థావరాలపైనే కాకుండా, పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోని కీలక సైనిక స్థావరాలపై కూడా దాడులు చేసి తమ పోరాట పటిమను చూపాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంచలన ప్రకటన చేశారు. లక్నోలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

"ఉగ్రవాదంపై భారత ప్రభుత్వ దృఢ సంకల్పానికి, మన సాయుధ బలగాల అపార శక్తిసామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' నిలువెత్తు నిదర్శనం. ఉరి దాడుల అనంతరం సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా ఉగ్రదాడి తర్వాత వైమానిక దాడుల మాదిరిగానే, పహల్గామ్ ఘటన అనంతరం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమని ప్రపంచానికి స్పష్టం చేశాం" అని రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. పాకిస్థాన్, పీఓకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని, సాధారణ పౌరులకు ఎలాంటి హాని కలగకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన వివరించారు.అయితే, పాకిస్థాన్ దీనికి భిన్నంగా వ్యవహరించిందని, మతపరమైన ప్రదేశాలతో సహా భారతీయ పౌర ప్రాంతాలపై దాడులకు తెగబడిందని ఆయన ఆరోపించారు. "ఇటువంటి దుశ్చర్యలకు ప్రతిగా మన సాయుధ బలగాలు అద్భుతమైన ధైర్యసాహసాలు, వ్యూహాత్మక సంయమనం ప్రదర్శించాయి. శత్రువులకు గట్టి గుణపాఠం చెబుతూ, పాకిస్థాన్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండితో సహా పలు పాకిస్థానీ సైనిక స్థావరాలపై దాడులు చేసి దీటుగా స్పందించాయి" అని ఆయన గర్వంగా ప్రకటించారు. ఈ చర్యలతో సరిహద్దులకు ఆవల ఉగ్రవాదులకు సురక్షిత స్థావరాలు లేవనే బలమైన, స్పష్టమైన సందేశాన్ని భారత్ పంపిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నవభారతం సరిహద్దులకు ఇరువైపులా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటోందని, ఉగ్రవాదంపై పోరులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు

## శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పళ్ళరసాలతో అభిషేకాలు



**పెనుమంట్ర,పెన్ పవర్, మే-11:**మండలంలోని చిన అంతర్వేదిగా ప్రసిద్ధి గాంచిన వనంపల్లి శ్రీలక్ష్మీ నరసింహా స్వామివారి ఆలయములో శ్రీస్వామి వారికి శ్రీలక్ష్మి అమ్మవారికి వివిధ పళ్ళరసాలతో అభిషేకాలు నిర్వహించినట్లు అర్చకులు తోలేటి రాంబాబు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివార్లకు, అమ్మ వార్లకు లక్ష పుష్పాలపూజ, తులసిపూజ, శాంతి కళ్యాణం, సుదర్శనహెూమం, అంజనేయస్వామి వారికి తమలపాకులు పూజ, శ్రీలక్ష్మి అమ్మవారికి కుంకుమపూజ చేసినట్లు తెలిపారు. తదుపరి అన్నప్రసాద వితరణ జరిగిందని అన్నారు. ఈ పూజా కార్యక్రమాలన్నీ అర్చక స్వాములు జ్యోసుల. శ్రీనివాస్, జ్యోసుల. ఆశీష్ శర్మ, శ్రీనివాసుల వేణు గోపాలాచార్యులు పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీస్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

## మస్క్ స్థానానికి తిరుగులేదు... రెండో స్థానం కోల్పోయిన బెజోస్

ప్రపంచంలోని అత్యంత సంపన్నుల జాబితాలో ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌ను అధిగమించి ప్రపంచంలోనే రెండో అత్యంత సంపన్న వ్యక్తిగా అవతరించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ఈ తాజా వివరాలను వెల్లడించింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ తన అగ్రస్థానాన్ని పదిలంగా కాపాడుకున్నారు.బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, మార్క్ జుకర్‌బర్గ్ నికర సంపద 212 బిలియన్ డాలర్లకు చేరగా, జెఫ్ బెజోస్ సంపద 209 బిలియన్ డాలర్లకు పడిపోయింది. మే 5 నాటి ట్రేడింగ్‌లో జుకర్‌బర్గ్ సంపద 846 మిలియన్ డాలర్లు పెరిగితే, అదే సమయంలో బెజోస్ 2.90 బిలియన్ డాలర్లు నష్టపోయారు. గత నెలలో మెటా షేర్ల విలువ 16 శాతానికి పైగా పెరగడం, అదే కాలంలో అమెజాన్ షేర్లు కేవలం 6.33 శాతం మాత్రమే వృద్ధి చెందడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు జుకర్‌బర్గ్ సంపద 4.63 బిలియన్ డాలర్లు పెరిగింది. మెటా ప్రకటించిన బలమైన ఆర్థిక ఫలితాలు కూడా జుకర్‌బర్గ్ సంపద వృద్ధికి దోహదపడ్డాయి. మే 1న వెల్లడించిన మొదటి త్రైమాసికంలో మెటా 42.31 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనా అయిన 41.39 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. ఇక రెండో త్రైమాసికానికి గాను 42.5 బిలియన్ డాలర్ల నుంచి 45.5 బిలియన్ డాలర్ల మధ్య ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది.మరోవైపు, టెస్లా మరియు స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ 331 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏప్రిల్ 23న మస్క్ నికర విలువ 7.5 బిలియన్ డాలర్లు పెరిగింది. ప్రభుత్వ వ్యవహారాలకు కేటాయించే సమయాన్ని తగ్గించుకుని, టెస్లా కంపెనీ కార్యకలాపాలపై మరింత ఎక్కువ దృష్టి సారిస్తానని ఆయన పునరుద్ఘాటించడంతో టెస్లా షేర్లు 5% మేర పెరిగాయి.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి..



**ఆలమూరు, పెన్ పవర్,మే11:**మండల పరిధిలోని చొప్పెల్ల గ్రామ సమీపాన ఉన్న 216(ఏ) నెంబరు గల జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలకలపాడు గ్రామానికి చెందిన, కొత్తపల్లి ఆనంద్(30) అను అతను మృతి చెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ప్రకారం ఆనంద్ అనే వ్యక్తి రాజమండ్రి ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ మేనేజర్ గా పని చేస్తున్నట్లు, తన ఏపీ 39 ఎఫ్ హెచ్ 7088 నెంబర్ గల ద్విచక్ర వాహనం పై అతని స్వగృహం నుండి రావులపాలెం వైపుకు వెళ్తూ ఉండగా జాతీయ రహదారి పై అదుపుతప్పి చొప్పెల్ల లాకుల సమీపంలో ఉన్న కాలువ డివైడర్ను బలంగా ఢీకొనడంతో బలమైన రక్తపు గాయాలు తగిలి అక్కడికి అక్కడే మృతిచెందారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆలమూరు ఎస్సై అశోక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా హాస్పిటల్ కి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తన బంధువులకు అప్పగిస్తామన్నారు. మృతుడికి భార్య, ఒక చిన్న పాప ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## ట్రైబల్ కమిషన్ చైర్మన్ గా బోజ్జి రెడ్డి



**గంగవరం, పెన్ పవర్, మే 11:**రాష్ట్ర షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్ పర్సన్ గా రంపచోడవరం కు చెందిన చోళ్ళ బుజ్జి రెడ్డిని బొజ్జి రెడ్డి నియమిస్తూ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భాగస్వామ్య పార్టీలను సమన్వయం చేసుకుంటూ ఆదివారం విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా భారతీయ జనతా పార్టీకి చెందిన బొజ్జిరెడ్డిని చైర్పర్సన్ గా నియమించారు. బోజ్జి రెడ్డి నియమాకం పట్ల బీజేపీ నాయకులు కూటమి నాయకులు పలు గిరిజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## పంచాయతీరాజ్ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు ప్రారంభం

**ఏలూరు పెన్ పవర్ మే 11:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు తాజాగా గ్రామ పంచాయితీలను జనాభా, లేదా ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించడానికి చర్యలు ప్రారంభించారు. జనాభా పదివేలు దాటి, ఆదాయం రూ. కోటి వరకు ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా విభజించనున్నారు. జనాభా 5వేలు దాటి రూ. కోటి లోపు ఆదాయం కలిగిన టిరుబాల్ పంచాయతీలుగా, జనాభా 4 వేలు నుండి పదివేల మధ్య ఉండి ఆదాయం రూ. 50 లక్షలు నుండి రూ. కోటి మధ్యలో ఉన్న పంచాయతీలను, మండల కేంద్రంలోని పంచాయతీలను గ్రేడ్ 1 పరిధిలోకి తీసుకురానున్నారు. జనాభా 2వేల పైబడి 4వేల లోపు ఉంటే గ్రేడ్ 2 పంచాయతీగా పరిగణిస్తారు. జనాభా 1500 నుండి 2వేల లోపు ఉన్న పంచాయతీలను గ్రేడ్ 3 పంచాయతీలుగా ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ప్రతిపాదనలు ఈనెల 13వ తేదీలోగా ప్రతిపాదనలు పంపవలసిందిగా పంచాయతీరాజ్ కమిషనర్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. గ్రామ పంచాయతీరాజ్ విధానంలో ఈ నాలుగు కేటగిరిలుగా విభజించే ప్రక్రియలో భాగంగా మరిన్ని మార్పులకు శ్రీకారం చుట్టానుంది. ఈ విధానంలో గ్రామపంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలు, లే అవుట్లు, వేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం, పారిశుద్ధ్యం, డ్రెయిన్ క్లీనింగ్, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇంటి పనులు వసూళ్లకు రెవెన్యూ విభాగాలు ఏర్పడనున్నాయి. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల బేసిక్ సర్వీసును ప్రామాణికంగా తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈ నెల



16వ తేదీ లోపుగా పంపవలసిందిగా కలెక్టర్లకు పంచాయతీరాజ్ కమిషనర్ లేఖ రాశారు. ఈ విధానంలో స్పెషల్ గ్రేట్ పంచాయతీల కు : ప్రతి గ్రామపంచాయతీలోనూ ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్ట్, సానిటరీ ఇన్స్పెక్టర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, కార్యాలయ సభార్డినేట్, కంప్యూటర్ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్, నైట్ వాచ్ మెన్, ఎలక్ట్రీషియన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, ఓ హెచ్ ఆర్ క్లీనర్ సిబ్బంది ఉంటారు.

## రాత్రులు ప్రధాన రహదారిపై పశువులు

**వాహనదారులకు ఇబ్బందులు**

**వై రామవరం, పెన్ పవర్,మే 11:** ప్రధాన రహదారులపై పశువులు నివాసం ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలోని పలు ప్రధాన రహదారులలో రాత్రులందు మూగజీవాలు నివాసం ఉండడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితులలో రాత్రి సమయంలో ప్రయాణం చేయవలసి వస్తే మూగజీవాల వలన ప్రమాదాల సంభవిస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలోనైనా పశువులను రోడ్లపై వదలకుండా ఆయా రైతులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత పంచాయితీ సిబ్బందిపై ఉందని పలువురు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై పశువులు మకాం ఉండకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.



## నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

**– జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, మే 11:** ప్రజా సమస్యలు పరిష్కార కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ మే 12వ తేదీ సోమవారం రోజున జిల్లాలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం "1100 – మీకోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు, నమోదైన మీ అర్జీ యొక్క స్థితిగతులు తెలుసుకోవచ్చునని తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్, మండల కేంద్రంలో మే 12వ తేదీ ఉదయం 10.00 గంటల నుంచి మ.1.00 గంట వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా, డివిజన్, మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. ప్రజలు వ్యయ ప్రయసలుపడి ప్రభుత్వ కార్యాలయాలకు వొచ్చి ఫిర్యాదు చెయ్యకుండా 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా తమ సమస్యలను తెలియ చేయడం ద్వారా కూడా పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియ చేశారు. మీకోసం ద్వారా నమోదు చేసిన ఫిర్యాదు యొక్క స్థితి తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సత్వర పౌర సేవలను పొందేందుకు ప్రభుత్వం



అమలులోకి తీసుకుని వచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ను తమ సెల్ ఫోన్లలో నిక్షిప్తం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలు పౌర సేవలు అందుబాటులో తీసుకుని రావడం జరిగిందని పేర్కొన్నారు. నీటి తీరువా, తదితర పన్నుల చెల్లింపులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చెల్లించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ పరమైన సేవలు అందుబాటులోకి రావడం వల్ల అధికారులు చుట్టూ తిరిగే అవసరం లేకుండా మీ మొబైల్ ఫోన్ కే ఆయా సేవలు అందుబాటులోకి తీసుకుని రావడం విశేషం అన్నారు.

# మాజీ మంత్రి రజని పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరం

**మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్**

**కాకినాడ.పెన్ పవర్ మే 11 :**మాజీ మంత్రి ,మహిళ అనే కనీస మర్యాద లేకుండా విడుదల రజిని పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ పేర్కొన్నారు.ఆదివారం సిటీ వైసీపీ కార్యాలయంలో సిటీ ప్రెసిడెంట్ సుంకర శివ ప్రసన్న సాగర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళల గౌరవానికి భంగం వాటిలితే సహించేది లేదని ఎన్నికల ముందు మాట్లాడిన చంద్రబాబు పవన్ కళ్యాణ్ ఈ సంఘటనకు ఏం సమాధానం చెబుతారని అన్నారు.మాజీ మంత్రి రజనీ అనుచరున్ని అరెస్టు చేయాలనే నెపంతో ఒక బీసీ మహిళ, మాజీ మంత్రి అయిన విడుదల రజిని ని అవమానించడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని ఇప్పటికే మహిళలు చిన్నపిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయి అని దీనికి కారకులైన వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని అన్నారు. నిందితులను అరెస్టు చేయడానికి ఒక పద్ధతి ఉంటుందని దానిని మరచి మాజీ మహిళా మంత్రిని అవమానించడమే ధ్యేయం అన్నట్లు పోలీసులు వ్యవహరించారని దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహిళా హెూం మంత్రి అనిత విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మహిళల గౌరవానికి భంగం కలిగించే ఏ చర్యను ప్రోత్సహించకూడదని ఆమె అన్నారు. రాష్ట్ర వైసీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి మాట్లాడుతూ కారులో ఉన్న మాజీ మహిళ మంత్రిని కనీస మర్యాద లేకుండా బయటికి లాగడం పోలీసులకు తగదని బీసీ మహిళ అంటే అంత చులకన భావం ఎందుకని బీసీల తోకలు కట్ చేస్తానన్న చంద్రబాబు దానిని నిజం చేసే విధంగా మహిళలను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో దిశా చట్టం అమలులో ఉండడంవల్ల మహిళలు స్వేచ్ఛగా ధైర్యంగా తిరగగలిగే వారని కూటమి ప్రభుత్వం లో మహిళల రక్షణకు ఎటువంటి చట్టాలు అమలులో లేకపోవడం వల్ల అనేక అఘాయిత్యాలు,అత్యాచారాలు జరుగుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం మహిళలు పిల్లలు బాలికల రక్షణ పై శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. తక్షణం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళా హెూంమంత్రి అనితలు జోక్యం చేసుకొని మహిళల గౌరవానికి అదేవిధంగా మాజీ మహిళా ఎమ్మెల్యే,ఎంపీ,మంత్రుల యొక్క గౌరవానికి భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ మహిళ అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, కాకినాడ అర్బన్ డవలప్మెంట్ చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి ,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వేంకట లక్ష్మి, తదితరులు ఉన్నారు.





# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి: బుగతా.




**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 11:** దేశవ్యాప్తంగా మే 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగారు రావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు,జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునర్రావు, మండల కార్యదర్శి గుర్రం వీరబాబు, అఖిల బారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఏ నాగమణి లు పాల్గొన్న సమావేశంలో బంగారు రాజు మాట్లాడుతూ

మే 20 తారీకున జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మే 24 న జరగబోయే సార్వత్రిక సమ్మె ప్రధానంగా దేశంలో ఉన్న అన్ని ప్రజా సంఘాలు , రైతు సంఘాలు, అసంఘటిత రంగ సంఘాలు పాల్గొంటున్నాయని, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ఈ సార్వత్రిక సమ్మెకు పూర్తిస్థాయి మద్దతు తెలుపుతుందన్నారు. రైతులకు ఇచ్చినటువంటి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదని , రైతాంగం నికి వ్యవసాయ చట్టాలను మళ్లీ దొడ్డిదారిని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దీని ద్వారా భూమిని అంతా కూడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారు అన్నారు. వ్యవసాయ కూలీల కోసం ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తూట్లు పొడిచారని దానికి ఉన్నటువంటి నిధులు అన్నిటిని గత ప్రభుత్వ లాగే ప్రస్తుత ప్రభుత్వం దారి మళ్లించే ప్రయత్నం చేస్తుందని అన్నారు . దేశంలో ఉన్నటువంటి కార్మిక చట్టాలను యధాతధంగా కొనసాగించాలని రైతులకు స్వామినాథ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, వ్యవసాయ కూలీలకు, వలస కూలీలకు రక్షణ చట్టం కల్పించాలని, పేదలందరికీ పెన్షన్ పథకం అమలు చేయాలని అన్నారు . నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలి ,విద్యుత్ స్మార్ట్ మీటర్ల పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు తో సహా అన్ని సంక్షేమ బోర్డులు పునరుద్ధించాలి. జాతీయ ఉపాధి హామీ పథకం లో 200 రోజులు పని దినాలు 600 రూపాయలు దినసరి వేతనం ఇవ్వాలి , కార్పొరేట్ అనుకూల రైతు వ్యతిరేక వ్యవసాయ మార్కెట్ విధానాలను రద్దు చేసి మద్దతు ధరలను చట్టబద్ధం చేసి అమలు చేయండి .అన్ని నిత్యవసర సరుకులు ధరలను తగ్గించాలి అని ఆహార భద్రతను సార్వత్రికంగా చేయాలి అని మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు.

## ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్

- నూతన అధ్యక్షునిగా గ్రంధి నారాయణరావు (బాజ్జి )



**కాకినాడ.పెన్ పవర్ మే 11 :** ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ కాకినాడ పెద్ది రత్నాజీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షునిగా గ్రంధి నారాయణరావు బాబ్జి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్ గా ప్రముఖ న్యాయవాది బచ్చు రాజేష్, పైడా భవాని ప్రసాద్ ఎలక్షన్ అధికారులుగా వ్యవహరించడం జరిగింది. నూతన కార్యదర్శిగా పసుమర్తి కాశీ,కోశాధికారిగా గుర్రం సత్యనారాయణ,వైస్ ప్రెసిడెంట్ గా డేగల రమేష్ ను గ్రంధి నారాయణ రావు నామినేట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దాసరి సాయి కృష్ణ, నూలు పూర్ణయ్య, గమిని సత్యం,బోగవిల్లి రామారావు, డేగల రమేష్,చాంబర్ సభ్యులు, వ్యాపార వర్తక ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.?

## ఆదిత్య కళాశాలలో జాతీయ సాంకేతిక దినోత్సవం



**కాకినాడ.పెన్ పవర్ మే 11 :**స్థానిక ఆదిత్య కళాశాల లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా సాంకేతిక రంగంలో విశేష ప్రతిభ చూపిన విద్యార్థుల కు బహుమతులు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ"మన

భారతదేశం లో 1998లో పోఖ్రాన్‌లో జరిగిన విజయవంతమైన అణు పరీక్షలతో ప్రారంభమైన ఈ ఆచారం, భారతదేశ వృద్ధి, అభివృద్ధిలో సాంకేతికత యొక్క కీలక పాత్రను నొక్కి చెబుతుందని,జాతీయ సాంకేతిక దినోత్సవం యొక్క సారాంశం యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం మరియు సాంకేతికత, ఇంజనీరింగ్ మరియు గణితం లో కెరీర్‌లను కొనసాగించడానికి వారిని ప్రేరేపించడం అని, ఇది విద్యాసంస్థలు, పరిశ్రమలు మరియు ప్రభుత్వాల మధ్య సహకారాన్ని పెంపొందిస్తుందని అన్నారు.చారిత్రాత్మక పోఖ్రాన్ అణు పరీక్షల జ్ఞాపకార్థం భారతదేశంలో మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవంగా మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రకటించారని తెలిపారు.ఆదిత్య కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా బి ఇ ఎల్ ఎన్ నాయుడు మాట్లాడుతూ"

మే 11 , 2025 జాతీయ సాంకేతిక దినోత్సవం యొక్క థీమ్ – " ఆవిష్కరణ ద్వారా స్థిరమైన రేపటిని సాధికారపరచడం" అని, మెరుగైన భవిష్యత్తును నిర్మించడంలో ఆవిష్కరణ పోషించాల్సిన పాత్రను సకాలంలో గుర్తు చేస్తుందని తెలిపారు.

మా ఆదిత్య కళాశాల లో సాంకేతిక రంగం లో పలు రకాల కోర్సులు నేర్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం లో కాకినాడ ఐడిఎ సభ్యులు డా శ్రీ వల్లి,డా దీప, డా నాగేంద్ర ,ఆదిత్య కళాశాలల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ తేజేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

## మలకపల్లి గవర్నమెంట్ హై స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**తాళ్ళపూడి, పెన్ పవర్, మే 11:**మలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చదువు చెప్పిన గురువులను ఆహ్వానించారు. అదేవిధంగా ఆ విద్యా సంవత్సరంలో చదువుకున్న వారు కుటుంబాలతో విచ్చేశారు. ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉన్న వారు ఫోన్ ద్వారా గురువులను, మిత్రులను కాంటాక్ట్ అయ్యారు. గురువులను శాలువాలతో, పూలమాలలతో విద్యార్థులు సన్మానించి, గురువులతో ఉన్న పాత జ్ఞాపకాలను విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. గురువులకు పాదాభివందనం చేసి, ఆశీస్సులు పొందారు. అనంతరం చిన్ననాటి స్నేహితులు అందరూ ఒకరికొకరు తమ కుటుంబాల గురించి ముచ్చటించారు. వారి యొక్క వయస్సు మర్చిపోయి చిన్ననాటి జ్ఞాపకాల్లో కార్యక్రమంలో గడిపారు.

# డిసిసిబి చైర్మన్ గా తుమ్మల రామస్వామి



**కాకినాడ.పెన్ పవర్ మే 11:**డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షుడిగా తుమ్మల రామస్వామిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇప్పటికే ఆయన జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగాను కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గాను విధులు నిర్వహిస్తున్నారు. దీనితోపాటు నూతనంగా డిసిసిబి అధ్యక్ష పదవి ఆయనను వరించింది డిసిసిబి చైర్మన్గా తమలపాకు నియమించడం పట్ల జనసేన నాయకులు అభిమానులు కార్యకర్తలు, హర్షం వ్యక్తం చేశారు. నిజాయితీ క్రమశిక్షణ నిబద్ధత పార్టీ పట్ల విధేయత ఆయనకు ఈ అవకాశాలను కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు జిల్లా నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## శ్రీ ఉమా రామేశ్వర స్వామికి పూజలు

**పెనుమంట్ర,పెన్ పవర్, మే–11:**మండలంలోని సత్యవరంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామేశ్వర స్వామి వారి కళ్యాణ మహెూత్సవంలో భాగంగా అదివారం నాలుగవ రోజు స్వామివారికి నైవేద్యాలు పువ్వులతో పూజలు అభిషేకం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మిరియాల వెంకట శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి

చెందిన భక్తులు మిర్యాల వెంకట శ్రీనివాస్ గంగా మసేనమ్మ దంపతులు నైవేద్యాలతో పూజలు అభిషేకం చేశారు. అర్చకుల కొండవీటి సాయి ఆధ్వర్యంలో ఈ పూజలు అభిషేకాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# పలు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



**కె గంగవరం పెన్ పవర్ మే11:**రానున్న రోజుల్లో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న పలు బిటి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తుందన్నారు.గతంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని ప్రస్తుతం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల మీద దృష్టి సారించడం జరిగిందన్నారు.దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గంలో ఆదివారం సుమారు 5 కోట్ల రూపాయల ఉపాధి హామీ నిధులతో వెల్ల –ద్రాక్షారామం రోడ్డు నుండి వెలగపూడి కుసుమంబ ఫీల్డ్ వరకు, బాపనయ్య చెరువు పంచాయతీలో వెంకటాయపాలెం గణపతి నగరం బిటి రోడ్డు,రామచంద్రపురం మున్సిపాలిటీలో కొత్తూరు నుండి మూలపాడు వరకు బిటి రోడ్డు, యనమల గ్రామం లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను కూడా అందిస్తుందన్నారు.ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామన్నారు.మే నెలలో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు.రైతులకు పెట్టుబడి సాయం జూన్ నెలలో అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలిపారు అన్నారు.రాబోవు మూడు సంవత్సరాలలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దామని మంత్రి హామీ ఇచ్చారు.మాతృ దినోత్సవ సందర్భంగా ప్రజలందరికీ మంత్రి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తల్లి ప్రేమ వెలకట్టలేనిదన్నారు.ఈ సందర్భంగా తల్లులను సన్మానించి వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం పొందారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, పంచాయతీరాజ్ ఏ ఈ యేసు రత్నం, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పోలీసులు విస్తృత తనిఖీలు




**జగ్గంపేట, పెన్ పవర్, మే 11:** జగ్గంపేటలో ఆదివారం పలుచోట్ల పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు తన సిబ్బందితో కలిసి జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ లో అణువు అణువు పరిశీలించి ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అలాగే జగ్గంపేట–గోకవరం రోడ్డులో వాహనాలు నిలుపుదల చేసి ముమ్మర తనిఖీలు చేపట్టారు.

## కాలజ్ఞానంపై అధ్యయనం జరగాలి - శివశ్రీ

- వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న శివశ్రీ తదితరులు



**టి.నరసాపురం, పెన్ పవర్, మే11 :**

శ్రీమద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రచించిన కాలజ్ఞాన ఆత్మజ్ఞాన ప్రభోధాలపై లోతైనఅధ్యయనంజరగాలని ,ఇందుకుప్రభుత్వంప్రత్యేకవ్యవస్థను ఏర్పాటు చేయాలని, తపోనిష్టలో దర్శించి జరగబోవు ప్రళయాలు ఉత్పాతాలతో పాటు వాటినుండి తప్పించుకునే మార్గాలనుసయితంస్పష్టంచేశారని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధానసంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) పేర్కొన్నారు. టి నరసాపురం లోఆదివారంజరిగినవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ వార్షికోత్సవ కార్యక్రమానికి శివశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయకమిటి ఆధ్వర్యంలో గతమూడురోజులుగా జరిగిన వార్షికోత్సవాలు ఆదివారం అన్న సమారాధన తో ముగిశాయి. ఈసందర్భంగా ఆయన పాలగొని మాట్లాడుతూవీరబ్రహ్మేంద్రస్వామి వారుకాలజ్ఞానంలోపొందుపరచిన ప్రతి అంశం తు చ తప్పకుండా జరుగుతున్నాయన్నారు. ఈవి పత్తులనుండి మానవాళి రక్షణపొందే మార్గాలను సైతం ఆయనపొందు పరిచార న్నారు. కాలజ్ఞాన అంశాలపై అధ్యయనం జరిపేందుకు ప్రభుత్వాలు అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు.వీరబ్రహ్మేంద్రస్వామిభక్తులు కేవలం ఆరాధనలు అర్చనలకే పరిమితం కాకుండా ఆయన ప్రభోధాలను ప్రజలలోకి తీసుకు వెళ్ళాలని కోరారు. ఆయన చూపిన ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించేలా కృషి చెయ్యాలన్నారు. .ఈకార్య క్ర మంలోశ్రీనివాసచారిటీస్ ఫౌండర్ కటకంశ్రీనివాసాచార్యులు ఆలయప్రధాన అర్చకులు లక్కోజు నాగేశ్వరాచార్యులు. ఆలయ పాలకవర్గం దేవునిపల్లి రామకృష్ణ,రాయలవరపు దుర్గాచార్యులు.రాయలవరపు చిన్నారావు,కొక్కండ దుర్గాచార్యులు.సాల్వ కోటివీరచార్యులు

.కుందవరపు జగన్నాధచార్యులు. తదితరులు పాల్గొన్నారు.

## త్రివిధ దళాల క్షేమం కోరుతూ పళని క్షేత్రానికి పయనమైన జనసైనికులు

జెండా ఊపి యాత్రను ప్రారంభించిన పంతం





**కాకినాడ.పెన్ పవర్ మే 11 :**భారత్ పాకిస్తాన్ ల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ ప్రజలు సురక్షితంగా ఉండాలని, దేశ త్రివిధ దళాలకు దైవ శక్తి ఉండాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆద్వర్యంలో జన సేన నాయకులు, జనసేన సైనికులు పళని క్షేత్రంలో ప్రత్యేక పూజలకు కాకినాడ నుండి పయనమయ్యారు. వాహనాలకు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ జెండా ఊపి భారత మాతాకి జై అనే నినాదాలతో యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పంతం నానాజీ మీడియాతో మాట్లాడుతూ జనసేన నాయకులు,జన సైనికులు బస్, కారు, ట్రైన్ ల లో పళని క్షేత్రానికి యాత్రగా బయలు దేరారు అని, మంగళవారం పళని క్షేత్రం కి చేరుకొని దేశ పౌరులకు,సాయుధ దళాలకు అండగా దేవుడి ఆశీసులు ఉండాలని కోరుతూ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. మన దేశం ఆర్థికంగా, సైనిక శక్తిగా దృఢంగా ఉన్నా దేవుడి ఆశీస్సులు కూడా మెండుగా ఉండాలనే ఉద్దేశ్యంతో తమ అధ్యక్షులు పవన్ కల్యాన్ పిలుపు మేరకు వివిధ పుణ్య క్షేత్రాల్లో పూజలు నిర్వహిస్తున్నామన్నారు.ఉద్రిక్త వాతావరణం మధ్య విధులు నిర్వహిస్తున్న సైనికులకు అండగా యావత్ దేశ ప్రజలు అందరూ అండగా ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

# పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి

- మట్టి పాత్రలు, ధాన్యం కంకుల కుచ్చులు పంపిణీ.
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం మే 11:** పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం కోరారు. ఎంవిపి కాలనీలోని ఉషోదయ జంక్షన్ లో ఆదివారం సాయంత్రం గ్రీన్ క్లైమేట్ టీం విద్యార్థులకు పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచడానికి మట్టి పాత్రలు, పిచ్చుకల కోసం ధాన్యపు కంకులు గుత్తులు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరం లో ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని, పశుపక్ష్యాదుల పట్ల ప్రేమ తో జీవించాలని కోరారు. ఈ ఏడాది తమ సంస్థ అధిక సంఖ్యలో మట్టి పాత్రలు ధాన్యం కంకుల కుచ్చులు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి, జి నాగ మురళి, ఉపాధ్యాయులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకంఠం కొలవకపోవడం వల్ల పివిటిజి ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంపై ఆవేదన

అమ్మవారి దారకొండ గ్రామం నుంచి ప్రభుత్వ అధికారులకు వినతి



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మే 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా, జీకే వీధి మండలానికి చెందిన అమ్మవారి దారకొండ గ్రామంలో పివిటిజి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్ల నిర్మాణం తీవ్రంగా ప్రభావితమవుతోంది. పివిటిజి ఇళ్లకు సెన్షన్ అయినప్పటికీ గ్రామకంఠం స్థిరీకరించకపోవడంతో, భూమి కొలతలు స్పష్టంగా తెలియక నిర్మాణ కార్యక్రమాలు ఆగిపోయినట్టుగా గ్రామస్థులు తెలిపారు.గ్రామకంఠం స్థలం తెలియకపోవడం వల్ల మనుషుల మధ్య ఘర్షణలు, భూ వివాదాలు నెలకొననున్న పరిస్థితి ఏర్పడింది.ఈ నేపథ్యంలో,తక్షణమే గ్రామకంఠాన్ని కొలవాలని, సంబంధిత ఎమ్మార్వో, వీఆర్వో, మరియు సర్వేయర్‌లను గ్రామానికి పంపించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఈ మేరకు, అమ్మవారి దారకొండ వార్డు మెంబరు గుంట ఆనందరావు జిల్లా కలెక్టర్,ఐటిడిఎ పిఓ మరియు ఇతర అధికారులు తక్షణం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి కోసం గ్రామకంఠాన్ని త్వరితగతిన కొలిచి పివిటిజి ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు సాగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## జర్రెలలో బిగ్ టీవీ మెగా వైద్య శిబిరం





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మే11:**మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన జీకే వీధి మండలం జర్రెల పంచాయితీ పరిధిలో బిగ్ టివి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జర్రిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మజీద్, డాక్టర్ మణిదీప్,చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ఆడియాలజిస్ట్ మస్తాన్ వల్లి సౌజన్యంతో బిగ్ టివి మీడియా ప్రతినిధి వి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ రాజు పిలుపుమేరకు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాల నుంచి సుమారు 150 మంది వివిధ రుగ్మతలతో బాధపడుతున్న రోగులు పాల్గొని చికిత్స పొందారు. ఇందులో భాగంగా అవసరమైన రోగులకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫార్సు చేయగా, వినికిడి లోపం కలిగిన వారికి చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించే విధంగాను అలాగే వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి సదరం ధ్రువపత్రం మంజూరు చేసే విధంగా సహాయపడతామని సంబంధిత వైద్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు ఉచిత వైద్య సేవలతోపాటు, రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య సేవలు పొందిన రోగులకు బిగ్ టీవీ మీడియా ప్రతినిధి బిస్కెట్ ప్యాకెట్లను, తాగునీరు బాటిల్లను అందజేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన తిప్పల





**గాజువాక : పెన్ పవర్,మే11:**దయాల్ దయాల్ నగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు.తనూజ ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన చలివేంద్రాన్ని మాజీ శాసనాసభ్యుడు తిప్పల నాగిరెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీను లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులకు ప్రజలకు వారే మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నాయకుడు శ్రీను ఆధ్వర్యం వహించగా మండల కాంగ్రెస్ మండల వైఎస్సార్ పార్టీ అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు నాయకుడు మద్దాల అప్పారావు ప్రకాశ్ రెడ్డి రాంబాబు కే దేవి తదితరులు పాల్గొన్నారు. వేసవి కాలమంతా కొనసాగిస్తామని నిర్వాహకులు నాగిశెట్టి శ్రీను తెలిపారు..

## ఆర్ అండ్ బి కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన: ఎమ్మెల్యే పితాని



**పెనుమంట్ర, పెన్ పవర్, మే 11:** మండలంలో నెగ్గిపూడి శివారు నరసాపురం పెరవల్లి రహదారిపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఆచంట ఎమ్మెల్యే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం పనులను పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రూ 59 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణం పనుల్లో నాణ్యతలలోపిస్తే ఉపేక్షించేది లేదని అధికారులకు హెచ్చరించారు. అలాగే పెనుగొండ బ్రిడ్జి నిర్మాణం పనులు నాణ్యత ప్రమాణాలలో బడి పనిచేయాలని ఆదేశించారు. గత పాలకులు అభివృద్ధిని పక్కనపెట్టి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. .ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డి ఇ జి. వర లక్ష్మి, జేఈ ప్రసాద్, ఏఈ యశ్వంత్ , పెనుమంట్ర మండల పార్టీ ప్రెసిడెంట్ తవనంపూడి శ్రీనివాస్ రెడ్డి గారు (బుల్ల),నెగ్గిపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ గ్రామం తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ చిర్ల బాలాజీ రెడ్డి, మారుటేరు గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ కోణాల శ్రీనివాసరెడ్డి ,వెలగల మల్లికార్జున్ రెడ్డి , కర్రీ అచ్యుత రామారెడ్డి , కడలి వెంకటేశ్వరరావు, బొక్క వెంకటరమణ, శ్రీనివాస్ , తేతలి రాజా రెడ్డి , సోమ సుందర్ రెడ్డి , కారేపల్లి భాస్కరరావు,షేక్ మహమ్మద్ అలీ , కడలి సుబ్రహ్మణ్యం , పిసిని అప్పలనాయుడు, సుబ్బరాజు, కట్టా బాలాజీ వసు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాతృదేవోభవ కార్యక్రమం





**కాజులూరు, పెన్ పవర్,మే 11:** మండల వరిధిలోని తనుమళ్ళ అంగన్వాడీ కేంద్రంలో మాతృదినోత్సవాన్ని పురస్కరించు కుని ఆదివారం ఎన్.అరుణ సమక్షంలో మదర్స్ డే కార్యక్రమాన్ని తాళ్లరేవు ఐసీడీఎస్ గొల్లపాలెం సెక్టార్ ఆధ్వర్యంలో మనంగా నిర్వహించారు.ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నారులతో వారి తల్లులకు స్వయంగా వారు తయారు చేసిన గ్రీటింగ్స్ ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అంగన్వాడీ వర్కర్ అరుణ పిల్లతో కేక్ కట్ చేయించారు. దీంతో పిల్లల కేంద్రం కాస్తా తల్లుల కేంద్రంగా మారింది. అంగన్వాడీ కేంద్రంలో విల్లలతో పాటు తల్లులు సందడి చేశారు. వారి ఆనందాన్ని పిల్లతో వంచుకుంటూ తల్లులు సంబురవడ్డారు. అమ్మ అంటే స్వార్ధంలేని రూపానికి నిలువెత్తు నిదర్శనం. ధైర్యానికి మారుపేరు అమ్మ.తన ప్రాణాలను ఫణంగా పెట్టి అమ్మ జన్మనిచ్చింది. తప్పటడుగులు పడితే నడక నేర్పింది. విద్యాబుద్ధులు చెప్పి విజయసోపానం వెక్కించింది. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని జీవితానికి ఓ మార్గం చూపింది అమ్మే అంటూ పిల్లల తల్లులు పేర్కొన్నారు.పిల్లలకు సేవ చేయడంలో అ తల్లుల ఓవక అనిర్వచనీయం .తల్లి గొప్పతనాన్ని చెప్పాలంటే మాటలు రావడం లేదని... ఈ ప్రపంచంలో ఎవరూ వంచని ప్రేమ తల్లిమాత్రమే పంచుతుందని వలువురు తల్లులు మాట్లాడారు. కార్యక్రమంలో తనుమళ్ల అంగన్వాడీ చిన్నారులు, వారి తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలం నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. సుజాత



**సింహాచలం, పెన్ పవర్, మే 11 :** శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి దేవస్థానం, సింహాచలం కార్యనిర్వాహణాధికారిగా ఎన్.సుజాత బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఎన్. సుజాత ఆదివారం సింహాచలం దేవస్థానం ఇ ఓగా ఛార్జ్ తీసుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవోగా నియమించిన సుజాత మొదటిగా అప్పన్న స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నక్కాన ఆనంద్ కుమార్ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు సాదర స్వాగతం పలికారు. ముందుగా కప్పస్తంభం ఆలింగనము తదుపరి బేడా ప్రదక్షణ చేయించి, స్వామివారి దర్శనము అనంతరము వేద పండితులు వేద ఆశీర్వచనము, స్వామివారి పటము, ప్రసాదాలను ఆలయ ఏఈఓ ఆనంద్ కుమార్ అందించారు . వీరితో వైదిక సిబ్బంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివి రామరాజు, ఆలయ పర్యవేక్షకులు జివిఎస్కే ప్రసాద్, కంచి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## 9 వ వార్డులో వెలగపూడి ప్రతాప్ రుద్ర జన్మదిన వేడుక

- పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ప్రతాప్ రుద్ర



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం,మే 11:** తూర్పు నియోజకవర్గం శాసనసభ సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ రుద్ర పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం 9వ వార్డులో రామాలయం వీధిలో వార్డు టిడిపి ప్రెసిడెంట్ అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ళ సుబ్బరాజు. ఆధ్వర్యంలో ప్రతాప రుద్ర కేక్ కట్ చేసి అనంతరం వందమంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వార్డు టిడిపి సీనియర్ నాయకులు వెంపాడ శ్రీనివాసరెడ్డి వెంకన్న.సబ్బి. శివ.చెన్న శంకర్రావు. మరియు టిడిపి తెలుగు యువత మహిళ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## విద్యుత్ సమస్యను పరిష్కరించమని అధికారులకు మొర



**గాజువాక :పెన్ పవర్,మే11:** టీజేఆర్ నగర్ వాసులు ఎప్పటినించో విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని వారిని దృష్టిలో పెట్టుకొని వారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన శుభ సందర్భంగా ముఖ్య అతిథులకు చిరు సత్కారం చేసి ధన్యవాదములు తెలియపరిచారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ వార్డు లో ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని, అభివృద్ధిలో వార్డులో ప్రథమ స్థానంలో నిలబెడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, సీనియర్ నాయకులు ప్రగడ దానయ్య, ఆనంద్ కుమార్, దాలయ్య, ఏటీయన్ మూర్తి, జాన్ రమేష్, కళ్యాణ్ చక్రవర్తి, టీజేఆర్ కాలనీ వాసులు సింహాద్రి, రాజు, గురవయ్య, వెంకటేష్, రాము, భీముడు, ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో ఎండుద్రాక్ష తినొచ్చా..? ఎలా తినాలి.. తినడం వల్ల కలిగే ప్రయోజనాలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఎండుద్రాక్ష తినడం వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయో మనకు తెలుసు. అయితే ఎండు ద్రాక్షను ఏవిధంగా తినాలో చాలా మందికి తెలియదు. ఎండు ద్రాక్షను ఎండు ద్రాక్షగానే తింటుంటారు. మరి ఎండు ద్రాక్షను ఎలా తింటే ఎక్కువ బెనిఫిట్స్ పొందుతాం.. ఏ మోతాదులో , ఏ సమయంలో తింటే మంచిది.. ఎండాకాలంలో తినవచ్చా? వంటి సందేహాలను తీర్చుకోవడంతోపాటు ఎండు ద్రాక్షను తినడం వల్ల కలిగే ప్రయోజనాలగురించి తెలుసుకుందాం. నానబెట్టి తింటే చాలా రకాల హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయని న్యూట్రిషియన్లు చెబుతున్నారు. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా వేసవి కాలంలో దీనిని నానబెట్టిన తర్వాత మాత్రమే తినాలి. ఎందుకంటే ఎండు ద్రాక్ష స్వభావం వేడిగా ఉంటుంది.

**నానబెట్టిన ఎండుద్రాక్ష తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:**

శరీరాన్ని చల్లగా ఉంచుతుంది: వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి నానబెట్టిన ఎండుద్రాక్ష తినడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఎండుద్రాక్ష వేడి స్వభావాన్ని కలిగి ఉంటుంది, వాటిని నానబెట్టిన తర్వాత తినడం వల్ల శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. ఇది శరీరంలో వేడిని పెంచదు. నానబెట్టిన ఎండుద్రాక్ష తినడం శరీరాన్ని నిర్విషీకరణ, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**డీటాక్స్, హైడ్రేట్:** నానబెట్టిన ఎండుద్రాక్ష శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. అంతేకాదు హైడ్రేట్ చేయడంలో ఎంతో సాయపడుతుంది. నానబెట్టిన ఎండుద్రాక్ష తినడం వల్ల శరీరం నుంచివిషాన్ని బయటకు పంపిస్తుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కూడా సహాయపడుతుంది.

జీర్ణక్రియను మెరుగు పర్చుట:ఎండుద్రాక్షలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది, ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుతుంది. నానబెట్టిన ఎండుద్రాక్ష మలబద్ధకం,ఆమ్లత్వం వంటి కడుపు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

హిమోగ్లోబిన్‌ను పెంచుతుంది: ఎండుద్రాక్షలు ఇనుము, రాగి పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇవి హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. ఎండుద్రాక్షలోని ఇనుము ,రాగి కంటెంట్ ఎర్ర రక్త కణాల నిర్మాణం,పనితీరుకు దోహదం చేస్తాయి. తద్వారా హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి.

**గుండెకు మేలు:** ఎండుద్రాక్షలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంతో సాయం చేస్తుంది.

నానబెట్టిన ఎండుద్రాక్షలను ఎప్పుడు తినాలి?

నానబెట్టిన ఎండుద్రాక్షను ఉదయం ఖాళీ కడుపుతో తినడం మంచిది. రాత్రంతా నీటిలో నానబెట్టిన తర్వాత ఉదయాన్నే ఎండుద్రాక్షను తినవచ్చు.ఆ నీటిని కూడా త్రాగవచ్చు. ఈ ప్రక్రియ మీ శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

## థాంక్యూ డాడ్... నాకు అత్యుత్తమ తల్లులను ఇచ్చావు: సల్మాన్ ఖాన్ 'మదర్స్ డే' పోస్ట్

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### తన తల్లి సల్మా ఖాన్, తన తండ్రి రెండో భార్య హెలెన్ ను ఉద్దేశించి సల్మాన్ విషెస్

### ఇద్దరినీ తల్లులుగా పేర్కొన్న బాలీవుడ్ స్టార్



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా, బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్ ఖాన్ ప్రత్యేకంగా స్పందించారు. తన తండ్రి సలీం ఖాన్ కు ఆయన కృతజ్ఞతలు చెప్పడం విశేషం."నాకు ప్రపంచంలోనే అత్యుత్తమమైన తల్లులను అందించినందుకు నాన్నకు ధన్యవాదాలు" అంటూ సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు. "నా ప్రపంచంలోని అత్యంత అందమైన మహిళలకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. సల్మాన్ ఖాన్ తన తల్లి సల్మా ఖాన్‌తో పాటు, తన తండ్రి రెండో భార్య, ప్రముఖ నటి హెలెన్‌ను కూడా తల్లిగా భావిస్తూ ఆప్యాయత చూపుతారన్న విషయం తెలిసిందే. ఈ మేరకు సల్మాన్ వారిద్దరితో కలిసి ఉన్న ఫొటోను కూడా పంచుకున్నారు.ప్రతి ఏటా మాతృ దినోత్సవం నాడు తన తల్లులపై ప్రేమను కురిపించే సల్మాన్ ఖాన్, ఈసారి కూడా అదే తరహాలో తన భావాలను పంచుకోవడం ఆయన అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# యూట్యూబర్: 21 ఏళ్ళ సెల్ఫ్ మేడ్ మిలియనీర్.. ఇన్స్పిరేషనల్ జర్నీ..




**హైదరాబాద్ పెన్ పవర్:** చదువుకునే రోజుల్లో డబ్బు విలువ తెలుసుకున్నాడు. ఆర్థిక స్వేచ్ఛ లేకండా ఏదీ సాధించలేమని అర్థమైంది. అందుకే డబ్బే లక్ష్యంగా పనిచేశాడు. పదిహేడేండ్ల వయసులోనే నెట్?వర్క్? మార్కెటింగ్ మొదలుపెట్టాడు. ఒక పెద్ద టీమ్?ని ఏర్పాటుచేసుకున్నాడు. 21 ఏండ్లు వచ్చేసరికి కోటీశ్వరుడు అయ్యాడు పుష్కర్ రాజ్ ఠాకూర్. ఆ తర్వాత మోటివేషనల్ స్పీకర్, బిజినెస్ కోచ్, యూట్యూబర్, రిలేషన్‌షిప్ అడ్వైజర్‌గా ఎదిగాడు. ఇప్పుడు యూట్యూబ్? ద్వారా స్టాక్ మార్కెట్ పాఠాలు చెప్తూనే ఏంజెల్ ఇన్వెస్టర్‌గా మారాడు.

పుష్కర్ రాజ్ ఠాకూర్ 1995 జనవరి 1న ఢిల్లీలో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. చిన్న వయసులోనే సక్సెస్? సాధించి మిలియనీర్ అయ్యాడు. అతనికి చిన్నప్పుడు చదువంటే పెద్దగా ఇష్టం ఉండేది కాదు. కానీ.. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్ షిప్ మీద బాగా ఆసక్తి ఉండేది. అందుకే 9వ తరగతిలో ఉన్నప్పుడే పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులో చేరాడు. ఆ టైంలో సరిగ్గా చదవడం లేదని స్కూల్? టీచర్ బాగా తిట్టడంతో కష్టపడి చదివాడు. టీచర్ భయంతోనే 10వ తరగతి పాసయ్యాడు. మోటివేషనల్? స్పీకర్‌గా రాణించాలనే ఉద్దేశంతో 12వ తరగతి తర్వాత సైకాలజీ కోర్సు చేశాడు. దఅయితే.. చదువులో రాణించకపోయినా కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్? నేర్చుకున్నాడు. దాంతో అతని ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. అప్పుడే ఒక నెట్‌వర్క్ మార్కెటింగ్ సెమినార్ విన్నాడు. అది అతనిలో ఎంతో స్ఫూర్తిని నింపింది. దాంతో 17 సంవత్సరాల వయసులోనే నెట్‌వర్క్ మార్కెటింగ్ మొదలుపెట్టడంతోపాటు కమ్యూనికేషన్, పర్సనల్ డెవలప్?మెంట్?కు సంబంధించి ఒక ట్రైనింగ్ సెంటర్‌ని స్థాపించాడు. అదే అతని సక్సెస్ జర్నీకి మొదటి మెట్టుగా నిలిచింది. దాని ద్వారా ఠాకూర్ లక్షలాది మందికి వాళ్ల కలలను సాకారం చేసుకోవడానికి కావాల్సిన మరోధైర్యాన్ని ఇచ్చాడు.

**గో సెల్ఫ్‌మేడ్**

గో సెల్ఫ్‌మేడ్ పేరుతో ఠాకూర్ చాలా వీడియోలు చేశాడు. దాన్ని ఒక మిషన్‌లా ముందుకు తీసుకెళ్తున్నాడు. తన ఫాలోవర్స్?ని సొంత వ్యాపార ప్రయాణం మొదలుపెట్టేలా ప్రోత్సహించడం, అందుకు కావాల్సిన స్కిల్స్‌ని నేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు. "యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంత వ్యాపారాలు మొదలుపెట్టడమే భారత ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఏకైక మార్గం. ఆర్థిక స్వేచ్ఛ దొరికినప్పుడే ఒక వ్యక్తి సక్సెస్? అయినట్టు" అంటాడు ఠాకూర్.?

**యూట్యూబ్‌లో పాఠాలు**

ఠాకూర్ 2011 డిసెంబర్? 23న 'పుష్కర్? రాజ్?కుమార్? స్టాక్‌మార్కెట్ ఎడ్యుకేటర్?' పేరుతో యూట్యూబ్? చానెల్? పెట్టాడు. కానీ.. కొన్నేళ్ల పాటు పెద్దగా వీడియోలు చేయలేదు. 2018 నుంచి రెగ్యులర్?గా వీడియోలు అప్?లోడ్? చేస్తున్నాడు. ప్రస్తుతం చానెల్‌ని 13.9 మిలియన్ల మంది సబ్‌స్క్రయిబ్ చేసుకున్నారు. దీంతోపాటే మరో ఏడు చానెళ్లను నడుపుతున్నాడు. వాటిలో కూడా రెగ్యులర్?గా కంటెంట్? అప్?లోడ్? చేస్తున్నాడు. యూట్యూబ్?తోపాటు ఎండార్స్‌మెంట్స్, స్టాక్?మార్కెట్?, ఇతర వ్యాపారాల ద్వారా ప్రతి నెలా లక్షల్లో సంపాదిస్తున్నాడు. అతని ఆస్తుల విలువ సుమారు రూ. 24 కోట్లు ఉంటుందని అంచనా. ఠాకూర్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్ చేసిన కొత్తలో అనుకున్నంతగా లాభాలు రాలేదు. ఆ తర్వాత దాని గురించి బాగా నేర్చుకుని నెమ్మదిగా ఎదిగాడు. ప్రతి నెలా లక్షల్లో సంపాదించాడు. అతనికి 21 ఏండ్లు వచ్చేసరికి ఎవరి సాయం లేకుండానే కోటీశ్వరుడిగా మారాడు. ఇండియాలోని టాప్ నెట్‌వర్క్ మార్కెట్ డీలర్ల లిస్ట్‌లో చేరాడు. కానీ.. 24 ఏండ్ల వయసులోనే నెట్‌వర్క్ మార్కెటింగ్ నుండి రిటైర్ అయ్యాడు. అందులో తాను నేర్చుకున్న విషయాలు, అనుభవాలతో "బ్యాంగ్ ఆన్ ఇన్ నెట్‌వర్క్ మార్కెటింగ్" పేరుతో పుస్తకం కూడా రాశాడు.

**యూట్యూబ్‌లోకి**

ఠాకూర్ పెట్టిన ట్రైనింగ్ సెంటర్ కొన్నాళ్లకు మరిన్ని బ్రాంచ్?లుగా విస్తరించింది. ఆఫ్‌లైన్ మోడ్‌లో ఎంతోమందికి ట్రైనింగ్? ఇచ్చాడు. అందుకోసం ప్రత్యేకంగా కొంతమంది ఎక్స్‌పర్ట్స్‌ని కూడా నియమించుకున్నాడు. ఆ తర్వాత ఠాకూర్ దృష్టి డిజిటల్ ప్లాట్‌ఫామ్?ల మీద పడింది. ముఖ్యంగా యూట్యూబ్ ద్వారా చాలా ఎక్కువమందికి రీచ్? కావొచ్చనే ఆలోచన వచ్చింది. అందుకే ఏడేళ్ల క్రితం యూట్యూబ్?లో కంటెంట్? చేయడం మొదలుపెట్టాడు.

ఆ తర్వాత ట్రైనింగ్? అండ్? కన్సల్టెన్సీ సంస్థ 'పీఆర్?టీ గ్లోబల్ సొల్యూషన్స్'ను ప్రారంభించాడు. "చదువుతో పాటు ప్రతి ఒక్కరికీ ఆర్థిక నైపుణ్యం" ఉండాలి అంటాడు ఠాకూర్. అందుకే తన కన్సల్టెన్సీ సంస్థ ద్వారా స్టాక్‌మార్కెట్ పాఠాలు చెప్తున్నాడు. 'కోర్సెడ్స్? లెర్నింగ్? సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో మరో కంపెనీ పెట్టాడు. ఇది ఒక ఈ లెర్నింగ్ ఫ్లాట్‌ఫాం. ఇందులో రకరకాల కోర్స్?లు అందుబాటులో ఉన్నాయి. దీని ద్వారా పెద్ద పెద్ద కంపెనీలకు కూడా సర్వీస్?లు అందిస్తున్నాడు.

**స్టాక్ మార్కెట్ ఎక్స్‌పర్ట్**

ఠాకూర్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గానే కాకుండా స్టాక్ మార్కెట్ ట్రైనర్?గా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఏంజెల్ ఇన్వెస్టర్‌గా మారాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కూడా లాభాలు సాధించాడు. అంతేకాకుండా బ్రాండ్ స్పాన్సర్?షిప్?లు కూడా చేస్తున్నాడు. ఆయన యూట్యూబ్?లో ఎక్కువగా ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్, వ్యక్తిత్వ వికాసం, బిజినెస్ గ్రోత్‌పైనే వీడియోలు చేస్తున్నాడు. ఠాకూర్? స్పీచ్‌లు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉంటాయి.

ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహిస్తాయి. అతను రెండుసార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. 2022లో "అతిపెద్ద సోషల్ మీడియా మార్కెటింగ్ లెసన్", 2023లో "అతిపెద్ద ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ లెసన్" చెప్పి రికార్డ్స్ క్రియేట్? చేశాడు.

**స్టాక్ మార్కెట్ ఎక్స్‌పర్ట్**

ఠాకూర్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గానే కాకుండా స్టాక్ మార్కెట్ ట్రైనర్?గా కూడా పేరు తెచ్చుకున్నాడు. ఏంజెల్ ఇన్వెస్టర్‌గా మారాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కూడా లాభాలు సాధించాడు. అంతేకాకుండా బ్రాండ్ స్పాన్సర్?షిప్?లు కూడా చేస్తున్నాడు. ఆయన యూట్యూబ్‌లో ఎక్కువగా ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్, వ్యక్తిత్వ వికాసం, బిజినెస్ గ్రోత్‌పైనే వీడియోలు చేస్తున్నాడు. ఠాకూర్? స్పీచ్‌లు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉంటాయి.

ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహిస్తాయి. అతను రెండుసార్లు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. 2022లో "అతిపెద్ద సోషల్ మీడియా మార్కెటింగ్ లెసన్", 2023లో "అతిపెద్ద ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్ లెసన్" చెప్పి రికార్డ్స్? క్రియేట్? చేశాడు.

# రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదా?..మంచి నిద్రకోసం మూడు చిట్కాలు పాటించండి





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఆరోగ్యం బాగుంటేనే ఏదైనా సాధించవచ్చు..ఉన్నత స్థాయిలకు వెళ్లవచ్చు.మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించవచ్చు. అయితే ఆరోగ్యానికి మొదటి శత్రువు నిద్రలేమి. రాత్రి పూట మీకు నిద్ర పట్టడం లేదా..? నిద్రలేమితో పగటిపూట చిరాకు వస్తుందా? రోజంతా మీ దినచర్యను పాడు చేస్తుందా? నిద్రలేపోవడం అనేది ఇప్పుడు సర్వసాధారణ సమస్య అయిపోయింది.ప్రతీ ఇద్దరిలో ఒకరికి ఈ సమస్య ఉంది. నిద్ర లేకపోవడం వల్ల వ్యాధులు త్వరగా అటాక్ చేస్తాయి. మీరూ ఈ సమస్యతో బాధపడుతున్నారా?.. అయితే కళ్లు మూసుకున్న వెంటనే నిద్ర పట్టేలా కొన్ని చిట్కాలు, సులభమైన పద్దతులు ఈ ఆర్టికల్ లో మీకోసం.. నిద్ర అనేది శరీరం అలసిపోతే నిద్ర వస్తుంది అంటుంటారు.అయితే కొన్నిసార్లు శరీరం అలసిపోయినా నిద్ర పట్టకపోవచ్చు. సరైన సమయంలో శరీరం నిద్ర సంకేతాలు అందితేనే నిద్ర వస్తుంది. అలా శరీరం సరైన నిద్ర సంకేతాలు పొందేందుకు ఈ చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు డాక్టర్లు.

మొదటి చిట్కా: రాత్రిపూట నిద్రపట్టకపోతే మొదటి పరిష్కారం మార్గం.. మంచం మీద పడుకొని 4సెకన్ల పాటు గాలి పీల్చుకోవాలి.. తర్వాత 7 సెకన్ల పాటు గాలిని బంధించాలి. ఆ తర్వాత 8 సెకనుల పాటు గాలిని పీల్చుకోవాలి తర్వాత వదలాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది. కొద్ది నిమిషాల్లోనే నిద్రపోతారు.

రెండో చిట్కా: మంచి నిద్రకోసం .. నిద్రపోయేటప్పుడు కాటన్ సాక్స్ లు ధరించాలి. సాక్స్ ధరించడం వల్ల మీ పాదాలు వేడెక్కి.. శరీరాన్ని చల్లబర్చేందుకు మెదడుకు సంకేతాలు ఇస్తుంది. ఇది మంచి నిద్రకు దారి తీస్తుంది. కాటన్ సాక్స్ ధరించి నిద్రపోయే వ్యక్తులు రాత్రి పూట తక్కువసమయం మేల్కొంటారని ఓ అధ్యయనంలో తేలింది.

మూడో చిట్కా: లావెండర్ నూనెను వాసన చూడటం వల్ల మంచి నిద్ర వస్తుంది. లావెండర్ మీ మెదడుకు భావోద్వేగపరంగా అనుసంధానించే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటుంది. ఇది ఒత్తిడి స్థాయిని తగ్గిస్తుందని 11 క్లినికల్ ట్రయల్స్ లో నిర్ధారించారు. హృదయస్పందన రేటు, బీపీ, కొలెస్ట్రాల్ స్థాయి కూడా తగ్గుతాయి. ఇంకెందుకు ఆలస్యం.. నిద్రలేమి సమస్య ఉన్నవారు ఈ చిట్కాలనుపాటించండి..మంచి ఫలితాలను పొందవచ్చు.

# ఏడాదికి 150 మిస్సైల్స్ ఉత్పత్తి.. బ్రహ్మోస్ అంటే భయపడుతున్న పాక్.. ఏంటి ఈ క్షిపణి ప్రత్యేకత..!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాక్ కవ్వింపు చర్యలకు బుద్ధి చెప్పేందుకు ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అవ్వడమే కాకుండా ఇంకా కొనసాగుతోందని ఆర్మీ ప్రకటించింది. పాక్ డ్రోన్స్, మిస్సైల్స్ తో భారత్ పై దాడికి దిగుతున్న తరుణంలో.. ఒకే ఒక్క బాహుబలి క్షిపణి.. ఆ దేశాన్ని దడదడ వణికించింది. పాక్ కు చెందిన 10 కీలక ఎయిర్ బేస్ లను ధ్వంసం చేసేందుకు భారత్ అమ్ములపొంది నుంచి వదిలిన బ్రహ్మోస్.. ముఖ్యమైన ఎయిర్ బేస్ లను ధ్వంసం చేసినట్లు భారత్ ప్రకటించింది. ఇందులో మురిద్, రఫిక్వీ, నూర్ ఖాన్ (చకాలా), రహిమ్యార్, సుక్కుర్, చునియన్ తదితర ఎయిర్ బేస్ లు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది.

**బ్రహ్మోస్:**

పాకిస్తాన్ ఎయిర్ బేస్ లను ధ్వంసం చేయడమే కాకుండా పాక్ తోకముడిచి అమెరికా ద్వారా రాజీకి వచ్చేలా చేసిన బ్రహ్మోస్ క్షిపణి.. ఇండియా-రష్యా సంయుక్తంగా 1998లో నిర్మించిన ప్రాజెక్టు. భూ, జల, గగనతలం.. ఇలా ఎక్కడి నుంచైనా లాంచ్ చేయగల క్షిపణి ఇది. అన్ని కాలాల్లో, అన్ని వాతావరణ పరిస్థితులలో ఈ క్షిపణి పనిచేసే లాంగ్ రేంజ్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్.

**బ్రహ్మోస్ ప్రత్యేకతలు:**

రేంజ్: 450 కిలోమీటర్లపైనే. (800 కి.మీ. వరకు రేంజ్



కొనసాగిస్తున్నట్లు ప్రయోగాల్లో నిర్ధారించారు.)

స్పీడ్: సూపర్ సోనిక్ స్పీడ్. 2.8 నుంచి 3.0..) అంటే ధ్వని ) శబ్దానికంటే మూడు రెట్లు వేగంగా ప్రయాణిస్తుంది.

లాంచ్: వాయు, జల, భూ, సబ్ మెరైన్ ల నుంచి కూడా లాంచ్ చేయవచ్చు.

ఖచ్చితత్వం (అక్యూరసీ): అడ్వాన్స్ డ్ గైడెన్స్, నావిగేషన్ ద్వారా టార్గెట్ మిస్ అవ్వకుండా రీచ్ కాగలదు.

**పే లోడ్:** హై ఎక్స్ ప్లోజివ్ (అత్యధిక పేలుడు) వార్ హెడ్ ను క్యారీ చేయగలదు.

ఇండియన్ నేవీలో బ్రహ్మోస్ వాడకం 2005 నుంచి ఉంది. INS Rajput లో మొట్టమొదటి బ్రహ్మోస్ క్షిపణిని వినియోగించారు. 2007 నుంచి ఇండియన్ ఆర్మీలో కూడా వినియోగిస్తున్నారు.

ఉత్తర ప్రదేశ్ నూతన బ్రహ్మోస్ యూనిట్ ప్రత్యేకతలు: రక్షణ శాఖ ఉత్రప్రదేశ్ లో నూతన బ్రహ్మోస్ యూనిట్ ను ఆదివారం (మే 11) ప్రారంభించింది. సంవత్సరంలో 80 నుంచి 100 బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణిలను తయారు చేసే కెపాసిటీ ఈ యూనిట్ కు ఉంది. తర్వాత 100 నుంచి 150 నెక్ట్స్ జెనరేషన్ మిస్సైల్స్ ను ఉత్పత్తి చేస్తారు. బ్రహ్మోస్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసింది. భారత్ కు చెందిన DRDO, రష్యాకు చెందిన %చీూా% సంస్థలు సంయుక్తంగా తయారు చేశాయి. ఈ యూనిట్ లో తయారయ్యే మిస్సైల్స్ కు 290 నుంచి 400 కి.మీ. రేంజ్ ఉంటుంది. త్వరలో తయారు చేయబోయే నెక్ట్స్ జెనరేషన్ బ్రహ్మోస్ మిస్సైల్స్ 1290 కేజీల బరువు మాత్రమే ఉంటాయి (ప్రస్తుతం 2,900 కేజీలు). సుఖోయ్ SU-300 వంటి ఒకేసారి మూడు ఫైటర్ జెట్లను తీసుకెళ్లడం వీటి స్పెషల్.

# కంటి చూపును కాపాడే ఆహారాలు ఇవి..!

## చేపలు, కోడిగుడ్లు మంచివి

## క్యారెట్లు, పాలకూర, బాదం గింజలు తీసుకోవచ్చు

## వీటిల్లో కంటిని కాపాడే ఇంగ్రెడియంట్లు

సర్వేంద్రియానాం నయనం ప్రధానం. మన శరీరంలో కళ్లకు ప్రాధాన్యం ఎంతో ఉంటుంది. కావాల్సిన పోషకాలు అందేలా చూసుకుంటే చాలు.. కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవచ్చు. అలాగే, కంటి నరాలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. మధుమేహం, బీపీ ఉన్న వారు వాటిని నియంత్రణలో పెట్టుకుని, పోషకాహారం అందించడం ద్వారా కంటిచూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. పోషకాలంటే విటమిన్ ఏ, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అందించాలి.

కంటి చూపు ఎందుకు తగ్గుతుంది? అనే దానికి వయసు పెరగడం ఒక కారణం. ఫోన్లు, కంప్యూటర్ల స్క్రీన్లను గంటల తరబడి చూస్తుంటే కంటికి విశ్రాంతి తగ్గి, నష్టం జరుగుతుంది. ఇవి కాకుండా ఒత్తిడి, పోషకాల లేమితోనూ కంటి చూపు మసకబారుతుంది.



### చేపలు

కంటికి చేపలు ఎంతో మంచి చేస్తాయి. చేపల్లోనూ సాల్మన్ రకం మంచివి. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులు. కనుక ఇవి చెడు కొవ్వులను తగ్గిస్తాయి. కళ్లు పొడిబారిపోకుండా, రెటీనాకు మేలు చేస్తాయి.

### బాదం గింజలు

ఆల్మండ్స్ లో విటమిన్ ఈ తగినంత ఉంటుంది. ఇది కంటికి రక్షణనిస్తుంది. వయసు మీరడం వల్ల వచ్చే మాక్యులర్ డీజనరేషన్ నుంచి కాపాడుతుంది. అయితే, రోజులో బాదం గింజలను ఎక్కువ కాకుండా తీసుకోవాలి. అంటే ఒకేసారి మితిమీరి తినకూడదు.

### కోడి గుడ్లు

గుడ్లలో విటమన్ ఏ, లూటిన్, జియాక్సాంతిన్, జింక్ ఉంటాయి. విటమిన్ ఏ కంటి కార్నియాకు ఎంతో అవసరం. కంటిలో కనిపించే ఉపరితలాన్ని కార్నియాగా పేర్కొంటారు. లూటిన్, జియాక్సాంతిన్ కంటికి సమస్యలు రాకుండా రక్షణనిస్తాయి. రెటీనా ఆరోగ్యానికి జింక్ సాయపడుతుంది. లూటిన్, జియాక్సాంతిన్ ను మన శరీరం తయారు చేసుకోలేదు. పాలకూరలోనూ ఇవి లభిస్తాయి.

### క్యారెట్లు

క్యారెట్లలోనూ విటమిన్ ఏ పుష్కలంగా లభిస్తుంది. పైన చెప్పుకున్న ప్రయోజనాలకు అదనంగా, ఇన్ఫెక్షన్ల నుంచి కూడా విటమిన్ ఏ రక్షణనిస్తుంది.

నానబెట్టిన బాదం గింజలను రోజూ ఉదయం తినాలి

పొద్దున్నే నిమ్మరసం కలిపిన నీరు తాగాలి

స్ట్రెచింగ్ వ్యాయామాలతోనూ మంచి ఫలితాలు



# ఇలా చేస్తే.. జీర్ణక్రియకు తిరుగుండదు!

నేడు మారిన జీవనశైలి వల్ల ఎంతో మంది జీర్ణ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మన జీర్ణ వ్యవస్థ శరీరానికి కావాల్సిన ముఖ్యమైన పోషకాలను సంగ్రహిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. నోటి నుంచి పేగుల వరకు ఈ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలతో తిన్నది వంటికి కూడా పట్టదు. బరువు తగ్గుతారు. ఈ సమస్యల నుంచి బయట పడేందుకు, జీర్ణశక్తిని పెంచుకునే ఉపాయాలు ఉన్నాయి.

### బాదం గింజలు

బాదం గింజల్లో మంచి పోషకాలు ఉంటాయని తెలిసిందే. విటమిన్ ఈ, మెగ్నీషియం, మాంగనీస్, కాపర్, ప్రొటీన్, ముఖ్యమైన కెమికల్స్, ఫ్లావనాయిడ్, మినరల్స్ ఉంటాయి. మంచి కొలెస్ట్రాల్ కు కారణమవుతుంది. చెడు కొలెస్ట్రాల్, రక్తపోటును తగ్గిస్తుంది. దీంతో గుండె కు కూడా రక్షణ ఏర్పడుతుంది.ూ

అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఫలితాల ప్రకారం.. ప్రతి రోజూ బాదం తినడం వల్ల బ్యుటిరేట్ సింథసిస్ ప్రక్రియ మెరుగుపడుతుందని తెలిసింది. ఇది షార్ట్ చైన్ ఫ్యాటీ యాసిడ్. దీనివల్ల పేగుల ఆరోగ్యం బలపడుతుంది. పైగా బాదంలో ఉండే ఫైబర్ కూడా జీర్ణవ్యవస్థకు మంచి చేస్తుంది.

### నిమ్మరసం కలిపిన నీరు

మనలో ఎక్కువ మందికి ఉదయం నిద్ర లేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉంటుంది. కానీ దీనికి బదులు నిమ్మరసం కలిపిన నీరు తాగి చూడండి. ఇది జీర్ణ వ్యవస్థకు ప్రేరణనిస్తుంది. కడుపుబ్బరం, కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే కడుపులోకి వెళ్లిన తర్వాత అక్కడి నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది. నిమ్మలో ఉండే అసిడిటీ జీర్ణ రసాలను ఉత్పత్తయ్యేలా చేస్తుంది. దీంతో తీసుకున్న ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

### వ్యాయామం

ఉదయం వేళ వ్యాయామం మరో ముఖ్యమైన అంశం. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. యోగా చేసుకోవచ్చు. రక్త ప్రసరణ పెరిగేలా వేగంగా నడవడం, ఏరోబిక్ వ్యాయామాలు, లేదంటే కాళ్లూ, చేతులను కదిలించేవి అయినా చేసుకోవచ్చు. దీనివల్ల కూడా జీర్ణశక్తి బలపడుతుంది. ముక్కు ద్వారా దీర్ఘ శ్వాస తీసుకుని నోటి ద్వారా విడుదల చేసేదీ అనుసరించొచ్చు.

# వెయ్యేళ్ళ తర్వాతైనా.. కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తా.. ట్రంప్ సంచలన పోస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్రరాజ్యం అమెరికా మధ్యవర్తిత్వంతో భారత్, పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత శనివారం ( మే 10 ) సాయంత్రం సీజ్ ఫైర్ ను ఉల్లంగిస్తూ పాక్ కాల్పులు జరిపినప్పటికీ ప్రస్తుతం సరిహద్దు ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కొనసాగుతోంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ట్వీట్ చేశారు. ఇరు దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కరిస్తానని ట్రూత్ వేదికగా పోస్ట్ చేశారు. యుద్ధం వల్ల మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ లేవని భారత్, పాకిస్థాన్ అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని అన్నారు ట్రంప్. ఈ చారిత్రాత్మక నిర్ణయం వెనక అమెరికా పాత్ర ఉన్నందుకు గర్వపడుతున్నానని అన్నారు. భారత్, పాక్ లు ఈ నిర్ణయం తీసుకోకపోతే.. లక్షల మంది అమాయక ప్రజలు చనిపోయి ఉండేవారని అన్నారు ట్రంప్.ఇరు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని.. వెయ్యేళ్ళయినా కాశ్మీర్ సమస్యకు పరిష్కారం ఉంటుందంటే... భారత్, పాకిస్థాన్ లతో కలిసి పనిచేస్తానంటూ ట్రూత్ వేదికగా పోస్ట్ చేశారు ట్రంప్.

కాగా.. శనివారం ( మే 10 ) అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన సుదీర్ఘమైన చర్చల తర్వాత.. భారత్, పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణకు ఒప్పందం చేసుకున్నాయని వెల్లడించారు ట్రంప్. కామన్ సెన్స్ ఉపయోగించిన రెండు దేశాలకు అభినందనలు, ధన్యవాదాలు అంటూ ట్రంప్ కామెంట్ చేశారు. ఇండియా–,పాక్ మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు భారత్ అధికారికంగా ప్రకటించింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. శుక్రవారం మీడియా కాన్ఫరెన్స్ లో భాగంగా కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు చెప్పారు.భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ, సైనిక చర్యలు నిలిపివేయడంపై విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా స్పష్టత ఇచ్చారు. కాల్పులు ,సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్,పాకిస్తాన్ శనివారం మే(10) ఒక అవగాహనకు వచ్చాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ నిరంతరం రాజీలేని వైఖరిని కొనసాగిస్తోందని.. ఇకముందు కూడా కొనసాగిస్తుందని జైశంకర్ ట్వీట్ చేశా

# సరికొత్త లుక్ తో మారుతి సుజుకి బ్రెజా.. తక్కువ ధరతో టాప్ ఎండ్ ఫీచర్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్స్ ఫేవరెట్ %ాఖుం% లలో ఒకటైన మారుతి సుజుకి బ్రెజా సరికొత్త లుక్ తో మార్కెట్ లోకి వచ్చింది. అడ్వాన్స్ ఫీచర్స్, డిజైన్స్ తో కొత్త ఫేస్ లిఫ్ట్ మోడల్ ని లాంచ్ చేసింది మారుతి సుజుకి. ఇండియన్ మార్కెట్ కి అనుగుణంగా ధరలో పెద్దగా మార్పులు లేకుండానే కొత్త వేరియంట్ ను లాంచ్ చేసింది మారుతి సుజుకి. ఎలిగెంట్ డిజైన్, బెస్ట్ ఫీచర్స్ కోరుకునే ఇండియన్ కస్టమర్ అభిరుచికి అనుగుణంగా బ్రెజా కొత్త వేరియంట్ ని డిజైన్ చేసింది మారుతి సుజుకి.

**ఎక్స్ టీరియర్ డిజైన్ అప్ డేట్స్:**

బెజా కొత్త వేరియంట్ అట్రాక్టింగ్ గా.. ఇండియన్ రోడ్స్ పై మ్యాచో లుక్ తో కనిపించనుంది. ముందు భాగంలో మేజర్ ఫేస్ లిఫ్ట్ ఈ కొత్త వేరియంట్ కి ప్రధాన ఆకర్షణ అని చెప్పచ్చు.ఇది కార్ కి టాప్ ఎండ్ లుక్ ఇస్తుంది. కొత్త హెడ్‌లైట్ క్లస్టర్‌లలో ఇప్పుడు %ాజుణ% లైట్లు ఉన్నాయి, ఇవి రాత్రిపూట వెహికల్ కి బెటర్ విజిబిలిటీ ఇవ్వడమే కాకుండా అందంగా కనిపిస్తాయి.

బాడీ ప్యానెల్‌లు టైటర్ గ్యాప్స్ తో హై క్వాలిటీ పెయింట్‌తో అట్రాక్టివ్ గా ఉంది. సైడ్ నుంచి లైన్స్ తో బ్రెజా లుక్ ని మరింత ఎన్ హన్స్ చేస్తాయి. కొత్తగా రూపొందించిన 19, 20 ఇంచ్ అల్లాయ్ వీల్స్ మరింత మస్క్యూలర్ లుక్ ని ఇస్తోంది. అన్ని రోడ్ కండిషన్స్ కి తగిన గ్రౌండ్ క్లియరెన్స్ ఉంటుంది. క్రోమ్ డోర్ హ్యాండిల్స్, సైడ్ మోల్డింగ్‌లు హయ్యర్ సెగ్మెంట్ ఫీల్ ని ఇస్తున్నాయి.

**ఇంటీరియర్ రిఫైన్‌మెంట్స్:**

క్యాబిన్ లో కొత్త డబుల్ క్యాబ్ వర్షన్ కంఫర్ట్ లెవెల్స్ ని మరింత పెంచుతుంది. ఆర్కిటెక్చర్ ఎంత అట్రాక్టింగ్ ఉందో, ఫంక్షనింగ్ కూడా అంతే అట్రాక్టింగ్ గా ఉంటుంది.. అలాగే సెగ్మెంట్‌కు ప్రీమియం, మెటీరియల్స్ ఫీల్, ఇంప్రూవ్డ్ టెక్స్చర్‌లు క్యాబిన్ అంబియెన్స్ ని మరింత ఆకర్షణీయంగా చేశాయి. క్యాబిన్ కి హయ్యర్ క్వాలిటీ ఫీల్ ఇవ్వడం కోసం సాఫ్ట్ టచ్ ప్లాస్టిక్ ని స్క్రాచ్ స్టఫ్ ప్లాస్టిక్ తో రీప్లేస్ చేశారు. కొత్త వేరియంట్ లో సీట్ అప్ హొల్స్టరి కూడా అప్ గ్రేడ్ అయ్యింది. ఇది మంచి ఫీల్, బెటర్ ప్యాడింగ్ ఇస్తోంది. డ్రైవర్ సీట్ కి హైట్ అడ్జస్ట్మెంట్ ఉండటంతో అందరికి కంఫర్టబుల్ గా ఉంటుంది. వెనుక భాగంలో లెగ్‌రూమ్ కూడా సఫిషియెంట్ గా సపోర్టివ్ సీట్ కాంటూర్‌లతో, బ్రెజ్జా లాంగ్ డ్రైవ్‌లకు కూడా అనుకూలిస్తుంది.

**టెక్నాలజీ ఇంటిగ్రేషన్:**

టెక్నాలజీ పరంగా కొత్త బ్రెజాలో హైలైట్స్ ఏమీ లేవనే చెప్పాలి. ఒక్క కనెక్టివిటి ఫీచర్స్ తప్ప పెద్దగా మార్పులేమీ లేవు. రీజనబుల్ ధరతో రావడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మారుతి సుజికి కొత్త బ్రెజా ప్రారంభ ధర రూ. 8. 50 లక్షలు కాగా.. బ్రెజా టాప్ స్పెక్ వేరియంట్ ధర రూ. 14.14 లక్షలుగా ఉంది.

# మే 12న నాగార్జున సాగర్‌కు మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్.. వెయ్యి మందితో బందోబస్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ – 2025 పోటీలు శనివారం (మే 10) హైదరాబాద్ హైటెక్స్ లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ సుందరీమణులకు చూపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సోమవారం (మే 12) నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ లో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టును సంద్శించనున్నారు. ప్రపంచ సుందరీమణుల రాకకోసం నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. భద్రతా దృష్ట్యా బాంబు స్కాడ్, డాగ్ స్కాడ్, ఏరియా డామినేషన్ బృందాల చేత విస్తృత తనిఖీలు నిర్వహించింది జిల్లా పోలీసు యంత్రాంగం. నాగార్జునసాగర్ లో దాదాపు వెయ్యి మంది సిబ్బందితో పటిష్ఠ బందోదుస్తుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ దేశాల నుంచి సుందరీమణులతో పాటు ప్రతినిధులు వస్తున్నందున ఎలాంటి అవాంచనీయా ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుద్ధవనం సందర్శన ప్రాంతాలలో డ్రోన్ల పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే బుద్ధవనంతో పాటు అతిథులు రెస్ట్ తీసుకోవడానికి విజయ విహార్ గెస్ట్ హౌస్ ను అందంగా తయారు చేసింది పర్యటకశాఖ. ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలిస్తూ అన్ని అంశాలను మానిటరింగ్ చేస్తున్నారు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్చంద్ర పవార్.

# ఇక నుంచి డబుల్ ధమాకా: రోజుకు రెండు మ్యాచ్‌లు ప్లాన్ చేస్తున్న బీసీసీఐ



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఉద్రిక్త పరిస్థితులు తగ్గిపోయాయి.. సాధారణ స్థితికి వచ్చింది. ఇండియా-పాక్ మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్లు శుక్రవారం ( మే 10) సాయంత్రం 5 గంటలకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. దీంతో ఐపీఎల్ 2025 సాధ్యమైనంత తొందరగా ప్రారంభించే ఆలోచనలో బీసీసీఐ ఉంది. మొదట అనుకున్న సమయానికే అనగా మే 25 లోపు ఐపీఎల్ ముగించే ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా మంగళవారం (మే 13) బీసీసీఐ..ప్లేయర్లను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే ఆయా ఫ్రాంచైజీలకు తెలియజేసింది.

ఐపీఎల్ రీ స్టార్ట్ మే 15 లేదా మే 16 ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో ఇంకా 16 మ్యాచ్‌లు మిగిలున్నాయి. ఇందులో 12 లీగ్ మ్యాచ్‌లు కాగా.. నాలుగు ప్లేఆఫ్స్ దశవి. గురువారం పంజాబ్ కింగ్స్%-%ఢిల్లీ క్యాపిటల్స్ పోరు మళ్ళీ మొదట నుంచి జరగడం ఖాయంగా మారింది. రోజుకు రెండు మ్యాచ్ లు జరిపితే వారం రోజుల్లో లీగ్ మ్యాచ్ లు ముగుస్తాయి. ఆ తర్వాత ప్లే ఆఫ్స్ లో భాగంగా మరో నాలుగు మ్యాచ్ లు ఆరు రోజుల్లో ముగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓవరాల్ గా 12 లేదా 13 రోజుల్లో మిగిలిన ఐపీఎల్ టోర్నీ ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్ 11 నుండి లార్డ్స్‌లో జరిగే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఆటగాళ్ళు సన్నద్ధం కావాల్సి ఉంది. మే 25 తర్వాత వారు ఉండడం అనిశ్చితంగా మారింది. ఈ కారణంగా మిగిలిన షెడ్యూల్‌లో మరిన్ని డబుల్ హెడర్‌లను కలిగి ఉండాలని భారత బోర్డు యోచిస్తోందని తెలుస్తోంది. ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లను వేదికలుగా భారత బోర్డు ఎంపిక చేసినట్లు సమాచారం. పంజాబ్ కింగ్స్‌కు సొంత వేదికలైన చండీగఢ్, ధర్మశాలలలో అనిశ్చిత పరిస్థితుల మధ్య లీగ్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు తటస్థ వేదిక కేటాయించబడే అవకాశం ఉంది.

# మంధాన మజాకా: లంకపై సెంచరీ.. ఆల్‌టైం టాప్-3 కి చేరుకున్న స్మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వన్డేల్లో తన సూపర్ ఫామ్ కొనసాగిస్తోంది. క్రీజ్ లో నిలబడితే చాలు సెంచరీలు అలవోకగా బాదేస్తుంది. గత రెండేళ్లుగా 50 ఓవర్ల ఫార్మాట్ లో సెంచరీల వర్షం కురిపిస్తున్న ఈ టీమిండియా ఓపెనర్.. ఆదివారం (మే 11) శ్రీలంకపై మరో సెంచరీ కొట్టింది. మహిళల ట్రై సిరీస్ ఫైనల్లో భాగంగా మంధాన ఈ ఘనతను అందుకుంది. 101 బంతుల్లో 116 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోర్ చేయడంలో కీలక పాత్ర పోషించింది. మంధాన వన్డే కెరీర్ లో ఇది 11 వ సెంచరీ కావడం విశేషం.

ఈ సెంచరీతో స్మృతి మంధాన రికార్డ్ సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్ లో అత్యధిక సెంచరీల చేసిన ఆల్ టైమ్ జాబితాలో స్మృతి మూడో స్థానానికి చేరుకుంది. నిన్నటి వరకు 10 సెంచరీలతో టామీ బ్యూమాంట్ తో సమంగా ఉన్న స్మృతి.. తాజాగా శ్రీలంకపై సెంచరీతో టాప్ 3 లోకి ఎంట్రీ ఇచ్చింది. కేవలం 102 ఇన్నింగ్స్ ల్లోనే ఈ టీమిండియా వైస్ కెప్టెన్ ఈ ఘనత అందుకుంది. 15 సెంచరీలతో తొలి స్థానంలో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ మెగ్ లానింగ్ ఉంది. ఆ తర్వాత న్యూజిలాండ్ ఓపెనర్ సుజీ బేట్స్ రెండో స్థానంలో కొనసాగుతోంది.

ఇక ఈ సెంచరీతో టీమిండియా ఓపెనర్ మరో ఘనతను కూడా అందుకుంది. మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ తర్వాత శ్రీలంకలో వన్డే సెంచరీ సాధించిన రెండవ భారతీయ మహిళగా ఆమె నిలిచింది. ప్రస్తుత మ్యాచ్ విషయానికి వస్తే స్మృతి మందాన సెంచరీతో పాటు హర్లీన్ డియోల్ (56 బంతుల్లో 47), హర్మన్‌ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 41), జెమిమా రోడ్రిగ్స్ (29 బంతుల్లో 44) బ్యాటింగ్ లో రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. మల్కి మదార, దేవ్మి విహంగా, సుగంధిక కుమారి అందరూ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

# మే 15 లేదా 16న ఐపీఎల్ పునఃప్రారంభం...?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతలు కాల్పుల విరమణ ఒప్పందంతో తాత్కాలికంగా సద్దుమణగడంతో, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌ను తిరిగి పట్టాలెక్కించేందుకు బీసీసీఐ చురుగ్గా పావులు కదుపుతోంది. ఈ మేరకు ఫ్రాంచైజీలకు కీలక ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే, మే 15 లేదా 16వ తేదీన ఐపీఎల్ సీజన్ తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో ఐపీఎల్ అభిమానుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.జాతీయ మీడియా కథనాల ప్రకారం... పంజాబ్ కింగ్స్ జట్టు మినహా మిగిలిన అన్ని ఐపీఎల్ జట్ల ఆటగాళ్లు మే 13వ తేదీలోగా తమ తమ సొంత వేదికల్లో (హెూం గ్రౌండ్స్‌లో) రిపోర్ట్ చేయాలని బీసీసీఐ ఫ్రాంచైజీలకు మౌఖికంగా సూచించింది. ఐపీఎల్ 2025 సీజన్‌ను పునఃప్రారంభించేందుకు వీలుగా త్వరలోనే నూతన షెడ్యూల్‌ను రూపొందించనున్నట్లు బోర్డు ఫ్రాంచైజీలకు తెలియజేసింది. ఈ నేపథ్యంలో, తమ విదేశీ ఆటగాళ్ల ప్రయాణ ప్రణాళికలను వెంటనే సమర్పించాలని కూడా కోరింది. దీంతో ఫ్రాంచైజీలు తమ విదేశీ క్రికెటర్లను తిరిగి భారత్‌కు రప్పించేందుకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. మే 13 నాటికి అన్ని జట్ల ఆటగాళ్లు అందుబాటులోకి వస్తే, ముందుగా నిర్దేశించుకున్న ప్రకారం మే 25వ తేదీనే ఐపీఎల్ 2025 సీజన్‌ను ముగించాలని బీసీసీఐ యోచిస్తోంది. ఇందుకోసం మిగిలి ఉన్న 12 లీగ్ మ్యాచ్‌లను డబుల్ హెడర్ల పద్ధతిలో వేగంగా పూర్తి చేయాలని ప్రణాళిక రచిస్తోంది. ఇక పంజాబ్ కింగ్స్ జట్టుకు సంబంధించి, ఆ జట్టు మ్యాచ్‌లను ఒక తటస్థ వేదికపై నిర్వహించే అవకాశం ఉంది. అయితే ఆ వేదికను ఖరారు చేయాల్సి ఉంది.

పంజాబ్ జట్టుకు హెూమ్ గ్రౌండ్ మొహాలీ కాగా, ఇది పాకిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా ఉండడంతో ఇక్కడ మ్యాచ్ లు జరపడం శ్రేయస్కరం కాదని బీసీసీఐ భావిస్తోంది

# హనుమాన్ డైరెక్టర్ ఏం చేస్తున్నాడు..?

అ! సినిమాతో దర్శకుడిగా ప్రతిభ చాటి కల్కితో ఇంప్రెస్ చేసిన డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హనుమాన్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్నాడు. ఆ సినిమా పాన్ ఇండియా లెవెల్ లో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. హనుమాన్ సక్సెస్ తో ప్రశాంత్ వర్మ పేరు మారుమోగిపోయింది. హనుమాన్ చివర్లో సీక్వెల్ జై హనుమాన్ ప్రకటించాడు ప్రశాంత్ వర్మ. అసలైతే ఆ సినిమా ఈ ఇయర్ రావాల్సింది కానీ ఇంకా షూటింగ్ పూర్తి కాలేదు. ఇదే కాదు ప్రశాంత్ వర్మ మరో రెండు సినిమాలు కూడా కమిట్ అయ్యాడు. హనుమాన్ తర్వాత జై హనుమాన్ కన్నా ముందు రెండు సినిమాలు పూర్తి చేయాలని అనుకున్నాడు కానీ అది కుదరలేదు. ఐతే ప్రస్తుతం ప్రశాంత్ వర్మ జై హనుమాన్ పూర్తి చేయాలని చూస్తున్నా ఈ సినిమాలో రిషబ్ శెట్టి ని తీసుకున్నారు కాబట్టి అతని డేట్స్ కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

హనుమాన్ సినిమా విషయంలో ప్రశాంత్ వర్మ అనుకున్న దానికన్నా ఎక్కువ రెస్పాన్స్ వచ్చింది. ఐతే ఆ మూమెంట్ లోనే వెంటనే జై హనుమాన్ పూర్తి చేసుంటే అయిపోయేది కానీ జై హనుమాన్ కాస్టింగ్ కోసమే చాలా టైం తీసుకున్నాడు ప్రశాంత్ వర్మ. అందుకే చేసేదేమి లేక వెయిట్ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు అతను రిషబ్ శెట్టి ఖాళీ అయ్యేదాకా వెయిట్ చేయక తప్పట్లేదు. ఓ పక్క రిషబ్ శెట్టి కాంతారా 1 సినిమాను పూర్తి చేసిన తర్వాతే ఏ సినిమా అయినా చేయాలని ఫిక్స్ అయ్యాడు.

ఈలోగా ప్రశాంత్ వర్మ తను కమిటైన వేరే సినిమాలు పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నాడు. అదిరిపోయే టాలెంట్ ఉన్న ప్రశాంత్ వర్మ సినిమాల విషయంలో క్లారిటీ కాస్త మిస్ అవుతున్నట్టు అనిపిస్తుంది. ఐతే అవుట్ పుట్ మీద ఈ ఎఫెక్ట్ పడకుండా జాగ్రత్త పడితే మంచింది. ఈమధ్యనే అతను గల్లా అశోక్ నటించిన దేవకి నందన వాసుదేవ సినిమాకు కథ అందించాడు. ఆ సినిమా సక్సెస్ అవుతుందని అనుకోగా అది కాస్త మిస్ ఫైర్ అయ్యింది. ఇదిలా ఉంటే హనుమాన్ సినిమా చూసి ఎంకరేజ్ చేసిన ఆడియన్స్ జై హనుమాన్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిషబ్ డేట్స్ ఇవ్వాలి సినిమా పూర్తవ్వాలి అనే పరిస్థితి చూస్తుంటే జై హనుమాన్ 2026 చివర్లో రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

ఐశ్వర్య రాజేష్ గోల్డెన్ ఆరా ప్రకాశవంతంగా మెరిసింది





దివ్య భారతి పసుపు రంగులో స్టన్స్ చేస్తూ, కింగ్‌స్టన్ యొక్క థ్రిల్స్‌కి జీవం పోసింది




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com